
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అనకాపల్లి
జిల్లా వార్తలు
శనివారం 26 ఏప్రిల్ 2025



నేడు ముఖ్యమంత్రి రాక

- ఏయూలో సెంటినరీ అలూమ్ని భవనాన్ని ప్రారంభించనున్న చంద్రబాబునాయుడు
- సుమారు రూ.50 కోట్లు నిర్మాణం

·6లో



అన్ని గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు

నేరాల కట్టడికి సీసీ కెమెరాలు

- సీఎస్ఆర్ నిధులతో అంగన్వాడీ కేంద్రాలకు భవనాలు
- అనకాపల్లి, నర్సీపట్నం ఆస్పత్రుల అభివృద్ధి
- జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు కృషి
- జిల్లా అభివృద్ధి, మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ సీఎం రమేశ్
- జిల్లాలో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్. చిత్రంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి అనిత, ఎమ్మెల్యే బండారు, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీ జాహ్నవి

అనకాపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తాగునీటి కల్పనలో భాగంగా ప్రతి గ్రామంలో ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా అభివృద్ధి, మానిటరింగ్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని సమావేశంలో సభ్యులు అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ఆధ్వర్యంలో అమలవుతున్న పలు పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలంటే రూ.9 కోట్లు అవసరమని, సీఎస్ఆర్ నిధులతో భవనాలను పూర్తి చేస్తామన్నారు. చెడు అలవాట్లకు బానిసలైన యువతలో మార్పు తెచ్చేందుకు డీఅడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసి, మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనకాపల్లి, నర్సీపట్నం ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతోపాటు జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. జిల్లాలో మరో రెండు కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేస్తామని ఎంపీ చెప్పారు. గ్రామాల్లో నేరాలను అరికట్టేందుకు సీఎస్ఆర్ నిధులతో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, తాండవ రిజర్వాయర్ నుంచి ప్రజలకు తాగునీరు అందించేందుకు చేపట్టిన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల అధికారుల ద్వారా ఆయా శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధిని తెలుసుకున్నారు. అనకాపల్లి నుంచి రాజమహేంద్రవరం వరకు జాతీయ రహదారి విస్తరణ, ఇరువైపులా సర్వీసు రోడ్ల నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు. పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయ్కుమార్, పంచకర్ల రమేశ్బాబు, కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, ఎస్పీ తుహిన్ సిన్హా, జడ్పీ సీఈఓ నారాయణమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

ఇద్దరు ఎమ్మెల్యేలు గైర్హాజరు

జిల్లా అభివృద్ధి, మానిటరింగ్ కమిటీ సమావేశానికి అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు హాజరుకాలేదు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు జిల్లాలో ఐదుగురు వున్నారు. ఆహ్వానాలు అందకపోవడంతో వీరు కూడా సమావేశానికి రాలేదు.



పహల్గాంలో శ్రీబాలాజీ, భవానీ దంపతులు (ఫైల్ ఫొటో)

ఉగ్రదాడి నుంచి త్రుటిలో తప్పించుకున్నాం

అనకాపల్లికి చెందిన శ్రీబాలాజీ, భవానీ దంపతులు

- దాడికి పది నిమిషాల ముందు పహల్గాం నుంచి తిరుగుముఖం
- కాల్పుల శబ్దాలతో భయంతో పరుగులు
- క్షేమంగా ఇంటికి చేరిక

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): **కశ్మీర్లోని పహల్గాం ప్రాంతంలో 22వ తేదీన జరిగిన ఉగ్రవాదుల దాడి నుంచి అనకాపల్లికి చెందిన దంపతులు త్రుటిలో తప్పించుకుని బయటపడిన సంఘటన ఆలస్యంగా తెలిసింది. ఇందుకు సంబంధించి వారు తెలిపిన వివరాలిలా వున్నాయి.**

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రొఫెషనల్ వింగ్లో పనిచేస్తున్న స్థానిక నరసింగరావుపేటకు చెందిన పి.శ్రీబాలాజీ, భార్య భవానితో ఈ నెల 16వ తేదీన హనీమూన్కు బయలుదేరారు. తొలుత ఢిల్లీ, ఆగ్రాల్లో పర్యాటక ప్రదేశాలను సందర్శించారు. 19వ తేదీన కశ్మీర్కు చేరుకున్నారు. 20న సోన్మార్గ్, 21న గుల్మార్గ్లోని పర్యాటక ... మిగతా 6వ పేజీలో

శతాబ్ది సంబరాలకు వేళాయె

నేటితో 99 ఏళ్లు పూర్తి చేసుకుని వందో వసంతంలోకి అడుగిడనున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం

- ఏడాది పాటు ఉత్సవాల నిర్వహణ
- అకడమిక్, అవుట్రిచ్, మెగా ఈవెంట్లు
- నేడు పలు కార్యక్రమాలు
- ఉదయం 6 గంటలకు బీచ్రోడ్డులో వాక్థాన్
- మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఏయూ కన్వెన్షన్ సెంటర్లో ప్రధాన కార్యక్రమం




విద్యుత్ దీపాల కాంతులతో ఏయూ

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): **ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవ శోభను సంతరించుకుంది. 1926 ఏప్రిల్ 26వ తేదీన ఏర్పాటైన విశ్వవిద్యాలయం శనివారంతో 99 ఏళ్లను పూర్తి చేసుకుని, వందో సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఈ క్రమంలో శనివారం నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 26వ తేదీ వరకు శతాబ్ది ఉత్సవాలను నిర్వహించేందుకు ఏయూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.**

శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ శుక్రవారం ఉదయం కోర్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఏడాదిపాటు అకడమిక్, అవుట్రిచ్, మెగా ఈవెంట్లు జరపాలన్నారు. మెగా ఈవెంట్లను విభిన్న విభాగాలు సంయుక్తంగా సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖులను ఆహ్వానించాలన్నారు. సాధారణ సదస్సులకు భిన్నంగా ఈ మెగా ఈవెంట్లు ఉండాలని వీసీ దిశానిర్దేశం చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 26న శతాబ్ది ఉత్సవ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా సభ్యుల నుంచి కార్యక్రమాల నిర్వహణపై సూచనలు స్వీకరించారు. ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న వాక్థాన్ను శనివారం ఉదయం ఆరు గంటలకు బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు. అనంతరం సిరిపురం వద్ద ఉన్న సీఆర్ రెడ్డి సర్కిల్, స్నాతకోత్సవ మందిరం, ఏయూ పరిపాలనా భవనం వద్ద ఉన్న కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించనున్నట్టు తెలిపారు. ఆ తరువాత శతాబ్ది ఉత్సవాలను ప్రతిబింబిస్తూ ప్రత్యేకంగా తయారుచేసిన బెలూన్ను నగర పోలీస్ కమిషనర్ ఎగురవేస్తారన్నారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ప్రధాన వేడుకలు బీచ్రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఏయూ ... మిగతా 6వ పేజీలో

బల్క్డ్రగ్ పార్కుకు ఏలేరు నీరు

నక్కపల్లి మండలం కాగిత నుంచి 'పేట వరకు 15.5 కి.మీ.ల పైపులైన్



బల్క్ డ్రగ్ పార్కుకు నీటిని సరఫరా చేయనున్న ఏలేరు కాలువ (ఫైల్ ఫొటో)

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) **జిల్లాలోని నక్కపల్లి మండలంలో ఏర్పాటు కానున్న బల్క్డ్రగ్ పార్కు, ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్కు మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏపీఐఐసీ గతంలో సేకరించిన భూములకు జాతీయ రహదారి నుంచి ఇప్పటికే రోడ్డు నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఇప్పుడు నీటి అవసరాల కోసం పైపులైన్ నిర్మాణానికి ఎన్హెచ్హెచ్ఏ నుంచి అధికారులు అనుమతులు పొందారు.**

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్లో భాగంగా నక్కపల్లిలో మల్టీ మోడల్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కానుంది. నక్కపల్లి ఏపీఐఐసీ పారిశ్రామిక ప్రాంతంలో బల్క్డ్రగ్ పార్కుకు 2,001 ఎకరాలు, ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు 2,200 ఎకరాల భూములు కేటాయించిన ప్రభుత్వం ఆయా పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక దృష్టి సారించింది. ఏపీఐఐసీ సెజ్లో ఏర్పాటు కానున్న బల్క్ డ్రగ్ పార్కుకు ఏలేరు కాలువ నుంచి నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నక్కపల్లి మండలం కాగిత గ్రామం నుంచి పాయకరావుపేట వద్ద తాండవ జంక్షన్ వరకు 1,100 మి.మీ.ల వ్యాసార్థంతో 15.5 కిలోమీటర్ల పొడవున భారీ పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. దీనిని జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేయనున్నందున అనుమతి ఇవ్వాలంటూ ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎస్.నరసింహారావు గత నెలలో ఎన్హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్కు లేఖ రాశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎన్హెచ్ఏఐ అధికారులు.. ఈ మేరకు అనుమతి ఇస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

కాగా నాతవరం మండలం ఎంబీ పట్నం వద్ద ఏలేరు కాలువలో ఇన్టేక్ వెల్తో పాటు పంప్ హౌస్ నిర్మించనున్నారు. ఇక్కడి నుంచి పాయకరావుపేట మీదుగా నక్కపల్లి సెజ్లో బల్క్ డ్రగ్ పార్కుకు పైపులైన్ ద్వారా నీటిని తరలిస్తారు.

283 మంది పోలీసు సిబ్బంది బదిలీ

- 161 మంది పీసీలు, 95 మంది హెచ్సీలు, 27 మంది ఏఎస్ఐలు
- ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన వారికి తప్పని స్థానచలనం



ఆన్లైన్ విధానంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏఎస్పీ మోహన్రావు, సిబ్బంది

అనకాపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా 283 మంది పోలీసు సిబ్బందికి ఆన్లైన్ విధానంలో బదిలీలు జరిగాయి. ఎస్పీ తుహిన్ సిన్హా మార్గదర్శకాల ప్రకారం బదిలీల ప్రక్రియనిర్వహించారు. ఒక పోలీసు స్టేషన్లో ఐదు సంవత్సరాలు, అంతకుపైబడి పనిచేస్తున్న సిబ్బందికి ఆప్షన్తో పని లేకుండా స్థానచలనం కల్పించారు. ఆన్లైన్ విధానంలో సాగిన బదిలీల ప్రక్రియను ఏఎస్పీ (అడ్మిన్) దేవప్రసాద్, ఏఎస్పీ (క్రైమ్) ఎల్.మోహన్రావు పర్యవేక్షించారు. జిల్లా లో వివిధ పోలీసు స్టేషన్లలో ఖాళీలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిబ్బందికి వివరిస్తూ, సీనియారిటీ ప్రకారం స్టేషన్లను కేటాయించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఆన్లైన్ ... మిగతా 6వ పేజీలో

పాఠ్య పుస్తకాలు వచ్చేస్తున్నాయ్..!

నేడు గాజువాక గోదాము నుంచి మండలాలకు సరఫరా

- జిల్లాకు 5,30,355 పాఠ్య పుస్తకాల ఇండెంట్
- ఇప్పటికే నాలుగు లక్షలకుపైగా పుస్తకాల రాక
- జూన్ మొదటి వారంలోగా స్కూళ్లకు చేరవేత
- పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు పంపిణీ
- రెండు, మూడు సబ్జెక్టులు కలిపి ఒక పుస్తకంగా ముద్రణ



గాజువాక గోదాములో సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) **పాఠశాలలు తెరిచే సమయానికి విద్యార్థుల చేతికి పాఠ్యపుస్తకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నది. ఇప్పటికే గాజువాకలోని ఉమ్మడి విశాఖ జిల్లా పాఠ్యపుస్తక కార్యాలయానికి పాఠ్యపుస్తకాలు చేరాయి. వీటిని శనివారం నుంచి ఎంఈవో కార్యాలయాలకు తరలిస్తారు. అనంతరం మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తారు.**

జిల్లాలో ప్రభుత్వ, మునిసిపల్, జిల్లా పరిషత్, ఇతరత్రా యాజమాన్యాల కింద 1,958 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు రెండు లక్షల మందికిపైగా విద్యార్థులు వున్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి విద్యార్థుల చేతుల్లో పాఠ్య పుస్తకాలు ఉండాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాకు అవసరమైన పాఠ్యపుస్తకాలు ఇప్పటికే గాజువాకలోని గోదాముకు చేరాయి. జిల్లా విద్యా శాఖాధికారుల ఇండెంట్ ప్రకారం ఇక్కడి నుంచి శనివారం ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా జీవీఎంసీ పరిధిలోని అనకాపల్లి జోన్, నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీలు, అన్ని మండలాలకు పాఠ్యపుస్తకాలను సరఫరా చేస్తారు. ఆయా కేంద్రాలకు చేరిన పుస్తకాలను ఎంఈఓలు తమ పరిధిలోని పాఠశాలలకు పంపిణీ చేస్తారు. ఈ మొత్తం ప్రక్రియను జూన్ మొదటి వారం నాటికి పూర్తి చేసి, పాఠశాలల పునః ప్రారంభం రోజున విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. జిల్లాకు 5,30,355 పాఠ్యపుస్తకాలు అవసరమని ఇండెంట్ పెట్టామని, ఇప్పటికే నాలుగు లక్షలకుపైగా పాఠ్యపుస్తకాలు గాజువాక గోదాముకు చేరుకున్నాయని ఆయన చెప్పారు. కాగా ఈ ఏడాది ఏడో తరగతి పాఠ్యపుస్తకాలు మారనున్నందున అవి ఆలస్యంగా వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

రెండు, మూడు సబ్జెక్టులు కలిపి ఒక పాఠ్య పుస్తకం!

విద్యార్థులకు పుస్తకాలు భారం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రెండు, మూడు సబ్జెక్టులను కలిపి ఒక పుస్తకంగా రూపొందించారు. 1వ తరగతి నుంచి 5 తరగతి వరకు చెందిన తెలుగు, ఇంగ్లిషు, గణితం కలిపి ఒకే పుస్తకంగా ముద్రించారు. వర్క్బుక్ అదనంగా వుంటుంది. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిషు, హిందీ కలిపి ఒక పుస్తకంగా, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం కలిపి ఒక పుస్తకంగా ముద్రించారు. సిలబస్ విషయంలో కూడా కొంత వెసులుబాటు కల్పించారు.

కునారిల్లుతున్న పశువైద్యం

ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత



శిథిలావస్థలో ఉన్న గొలుగొండ పశు వైద్యశాల భవనం

- జిల్లాలో 13 మంది ఏడీస్థాయి డాక్టర్లకు.. ప్రస్తుతం ఉన్నది ఆరుగురే!
- 19 వెటర్నరీ అసిస్టెంట్, 59 సహాయకుల పోస్టులు ఖాళీ
- శిథిలావస్థలో ఆస్పత్రుల భవనాలు
- ప్రతిపాదనలకే పరిమితమైన మరమ్మతు పనులు
- సదుపాయాలు, సిబ్బంది కొరతతో వైద్యుల అవస్థలు

నేడు ప్రపంచ పశు వైద్య దినోత్సవం



నర్సీపట్నం వెటర్నరీ ఆస్పత్రిలో ఓటీ లేకపోవడంతో ఆరుబయట మేకకు శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్

నర్సీపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జంతువుల ఆరోగ్యం, సంరక్షణ, పశు వైద్యుల సేవలు గుర్తించుకునేందుకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ చివరి శనివారం 'ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని రెండున్నర దశాబ్దా నుంచి నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పశు సంరక్షణ, వైద్య సేవలపై అవగాహన సదస్సుల నిర్వహణ, పశు సంక్షేమంపై దృష్టి పెట్టడం దీని ప్రధాన లక్ష్యం. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పశు వైద్య సేవలు చాలా కీలకం. పశువులు ఆరోగ్యంగా ఉంటేనే మనుషుల ఆరోగ్యం, ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వం ఉంటాయని పశు వైద్య నిపుణులు అంటున్నారు. ఇంతటి కీలకమైన పశు సంవర్థక శాఖ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నది. పశువైద్యశాలల్లో సౌకర్యాలు అంతంత మాత్రంగానే వుంటున్నాయి. జిల్లాలో అత్యధిక పశువైద్య కేంద్రాలను శిథిల భవనాల్లో నిర్వహిస్తు న్నారు. అధికారులు, సిబ్బంది కొరతతో పశు వులకు సకాలంలో వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది. ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడంతో వెటర్నరీ డాక్టర్లు విధి నిర్వహణలో ఇబ్బందులు పడుతున్నారు.

అనకాపల్లి జిల్లాలో 13 సబ్ డివిజన్ స్థాయి పశువుల ఏరియా ఆస్పత్రులు, 60 వెటర్నరీ డిస్పెన్సరీలు ఉన్నాయి. సబ్ డివిజన్ వెటర్నరీ ఆస్పత్రిలో ఏడీ స్థాయి పశు వైద్యులు విధులు నిర్వహిస్తారు. జిల్లాలో దాదాపు సగం ఏడీ పోస్టులు ఖాళీగా వున్నాయి. కోటవురట్ల ఆస్పత్రిలో ఏడీ పోస్టు ఏళ్ల తరబడి భర్తీకి నోచుకోలేదు. 13 మంది ఏడీలకుగాను ప్రస్తుతం ఆరుగురు మాత్రమే వున్నారు. వెటర్నరీ డిస్పెన్సరీల్లో 19 వెటర్నరీ అసిస్టెంట్లు, అన్ని ఆస్పత్రుల్లో 59 ఆఫీస్ సబార్డినేట్ (సహాయకులు) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పశువులకు వైద్యం చేసేటప్పుడు వాటిని ... మిగతా 6వ పేజీలో

పంచాయతీలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి

- ఈ దిశగా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలి
- మునగపాక మండల సమావేశంలో ఎమ్మెల్యే 'సుందరపు'
- గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చిన సభ్యులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామ పంచాయతీ సంపద సృష్టించే మార్గాలను అన్వేషించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మళ్ల జయమ్మ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటైన మండల సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదాయం సమకూర్చే కొబ్బరి వంటి చెట్లను పెంచాలన్నారు. పంచాయతీలు అద్భుతాలు సృష్టిస్తే ప్రపంచం అద్భుతంగా మారుతుందని వివరించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. హానికరమైన ప్లాస్టిక్‌పై ప్రజల్లో అవగాహన పెంచి వినియోగం తగ్గించాలన్నారు. పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం పి-4 పథకాన్ని అమల్లోకి తీసుకు వచ్చినట్టు చెప్పారు. అనంతరం శాఖల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. వైస్ ఎంపీపీ గోజా వెంకటలక్ష్మి, వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, చూచుకొండ సర్పంచ్ వెంకట సూరిఅప్పారావు, గణపర్తి సర్పంచ్ చదరం గణేశ్‌నాయుడు, వెంకటాపురం సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి, తోటాడ ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, మునగపాక ఎంపీటీసీ-2,3 సూరిశెట్టి రాము, గోడగుర్తి గణేశ్ తదితరులు మాట్లాడుతూ విద్య, రెవెన్యూ, పారిశుధ్యం, తాగునీరు తదితర రంగాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీడీవో ఎం.ఉషారాణి, తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావు, ఎస్ఐ పి.ప్రసాదరావులతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

'ఇష్టమైన కోర్సులతో విద్యార్థులు సత్ఫలితాలు'



ప్రతిభ చూపిన విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసిన ఎంఈవో తదితరులు

మునగపాక, ఏప్రిల్ 25 (ఆంధ్రజోతి) : విద్యార్థులు ఇష్టమైన కోర్సుల్లో చేరడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చునని ఎంఈవో బుద్ద శివనాయుడు అన్నారు. ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన పాలిటెక్నిక్ మోడల్ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు శుక్రవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్టు, షిర్డీసాయి లా కళాశాల సంయుక్తంగా ఉచితంగా ఇటువంటి శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, సంస్థ వ్యవస్థాపకులు ఏవీఎస్ మూర్తి, ఉపాధ్యాయులు ఎం.సత్యనారాయణమూర్తి, మాడెం జోగారావు, ఏఆర్‌వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





కొవ్వొత్తుల ప్రదర్శనతో పాటు నిరసన శిబిరంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, చైర్‌పర్సన్ రమాకుమారి, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు

ఉగ్ర దాడిపై ఆగ్రహ జ్వాలలు

- ఎలమంచిలిలో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ
- కూటమి శ్రేణులతో పాటు పెద్ద సంఖ్యలో జనం హాజరు
- పాక్ దుశ్చర్యలను ఎండగట్టిన నేతలు

ఎలమంచిలి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శుక్రవారం రాత్రి ఎలమంచిలిలో అన్ని పార్టీలకు చెందిన నాయకులు, పెద్ద సంఖ్యలో పట్టణవాసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సైతారుపేట రోడ్డు జంక్షన్ నుంచి ధర్మవరం మీదుగా ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్, దిమిలి రోడ్డు వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా అక్కడ అంతా కలిసి మానవహారంగా ఏర్పడి ఉగ్రవాదుల చర్యలను ఖండించారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి తదితరులు మాట్లాడుతూ పహల్గాంలో 28మంది పర్యాటకులను హతమార్చడం దారుణమన్నారు. ఇందుకు ఉగ్రవాదులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాక్‌కు అన్ని దేశాలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పిట్టా శ్రీను, లవుడు లోవరాజు, గుర్రాల శేఖర్, నక్కా వెంకట్రామన్‌లతో పాటు మునిసిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వర్తక సంఘం ప్రతినిధులు, డ్వాక్రా మహిళలు, పెద్ద సంఖ్యలో కూటమి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఉగ్రదాడికి నిరసనగా పట్టణంలోని ప్రధాన రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన శిబిరంలో శుక్రవారం పలువురు కూటమి నాయకులు నినాదాలు చేశారు. ఇటువంటి దుశ్చర్యలను యావత్ భారత్ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. భారత దేశం సమర్థవంతమైన నాయకత్వంలో ముందుకు సాగుతుందని, ఉగ్రవాదులు ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పిట్టా శ్రీను, గొర్లె నానాజీ, కొఠారు సాంబ, దిన్‌బాబు, కరణం రవి, లంక రాజు, గుర్రాల శేఖర్ తదితరులు పాల్గొనారు.



ఎలమంచిలిలో కొవ్వొత్తులతో భారీగా ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ వర్గాల ప్రజలు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అచ్యుతాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా అచ్యుతాపురం, పూడిమడక, దుప్పితూరు, కోనెంపాలెం, కుమారపురంలలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఇందుకు ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపేటలో అయ్యప్పస్వామి ఆలయ తొమ్మిదో వార్షికోవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, సూరిశెట్టి రాము, ఆలయ కమిటీ ప్రతినిధులు బొడ్డేడ రాము, శరగడం గోవింద, దివాకర్, బొడ్డేడ అప్పారావు, దొడ్డి కోటేశ్వరరావు తదితరులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం ఆవరణలో అన్నసమారాధన జరిపారు.

అప్పారాయుడుపాలెం రోడ్డుపై గుంతల పూడ్చివేత

రాంబిల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : అడుగడుగునా గుంతలమయమై ప్రమాదకరంగా మారిన మండలంలోని అప్పారాయుడుపాలెం రోడ్డులో ఎట్టకేలకు గోతులను పూడ్చారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'ప్రయాణించ లేకపోతున్నాం...' శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు వి.దిన్‌బాబు వెనువెంటనే స్పందించారు. తన సొంత నిధులను వెచ్చించి వెంకటాపురం-ఎలమంచిలి ప్రధాన రోడ్డులోని అప్పారాయుడుపాలెం జంక్షన్ నుంచి అప్పారాయుడుపాలెం గ్రామం వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలను క్రషర్ బుగ్గితో కప్పించారు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అచ్యుతాపురం జంక్షన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

మలేరియాపై అవగాహన ర్యాలీలు

అచ్యుతాపురం/ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మలేరియా అంతరం అందరి సంకల్పం కావాలని అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణులు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ లిఖిత అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శక్రవారం ఇక్కడ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునన్నారు. ప్రధానంగా దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వేణుగోపాల్, లండా అప్పలకొండ, ఎం.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, మండలంలోని హరిపాలెంలో పీహెచ్‌సీ సిబ్బంది మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ మానస సరోజిని మాట్లాడుతూ మలేరియా సోకకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు దోమలు వృద్ధిచెందకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య శిక్షకురాలు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమా మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక మండలంలో...

మునగపాక : మండలంలోని మునగపాక, చూచుకొండ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు ఈ సందర్భంగా మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.విమలగిరి మాట్లాడుతూ మలేరియా వంటి వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోకిన తరువాత చేపట్టాల్సిన చర్యలను వివరించారు. చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్.ఎస్తేర్‌రాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఆర్.దేవకాంత, సూపర్ వైజర్లు ఎం.నాగేశ్వరరావు, వి.సీతామహాలక్ష్మి, ఆరోగ్య విస్తరణాధికారి గుర్రం శ్రీనివాసరావు, పర్యవేక్షకులు జి.లక్ష్మణ్, ఎ.యు.బేగం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భానుడి భగభగ..



జన సంచారం లేక బోసిబోయిన కోటవురట్ల ప్రధాన రహదారి

కోటవురట్ల ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు భానడి భగభగలు పెరిగిపోతున్నాయి. ఈ ఏడాదిలో ఎప్పుడూ లేనంతా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీలు నమోదైంది. వారం రోజులుగా ఎండలు, వడగాడ్పులకు వృద్ధులు, చిన్నారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండల తీవ్రతకు ఇంటిలోని వస్తువులు కూడా వేడెక్కిపోతున్నాయి. సాయంత్రం 5 గంటలు దాటినా వడగాడ్పులు తగ్గడం లేదు. ఉదయం 10 గంటల నుంచే రహదారులపైకి రావాలంటే జనం భీతిల్లిపోతున్నారు. దీంతో జన సంచారం లేక రహదారులన్నీ వెలవెలబోతున్నాయి.

పహల్గాం ఉగ్రదాడి దుర్మార్గమైన చర్య

- జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి



పాయకరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన పార్టీ నాయకులు

పాయకరావుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ పహల్గాం ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడి దుర్మార్గమైన చర్యగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి పేర్కొన్నారు. ఉగ్రదాడిని ఖండిస్తూ జనసేన పార్టీ చేపట్టిన మూడు రోజుల సంతాప దీనాల కార్యక్రమంలో భాగంగా మూడో రోజు శుక్రవారం పాయకరావుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో పట్టణంలో మంగవరంరోడ్డు జంక్షన్ నుంచి తాండవ వంతెన వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గౌతమ్ థియేటర్ ఎదుట మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా గెడ్డం బుజ్జి మాట్లాడారు.

టీడీపీ గ్రామ అధ్యక్షుల నియామకం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదరాంభద్రపురం టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా శింగంశెట్టి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొన్ని రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న టీడీపీ సంస్థగత ఎన్నికల్లో భాగంగా శుక్రవారం పెదరాంభద్రపురంలో నిర్వహించిన సమావేశంలో టీడీపీ గ్రామ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన శింగంశెట్టి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అలాగే మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో జరిగిన టీడీపీ సమావేశంలో గ్రామశాఖ నూతన కమిటీ ఎన్నికలో అధ్యక్షుడిగా కురందాసు రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీలను టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు తదితరులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ప్రపంచ మేధావి

- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్

పాయకరావుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ చెప్పారు. మండలంలోని పీఎల్‌పురంలో శుక్రవారం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీరంగం రమేశ్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఒక ప్రైవేటు హోటల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ రమేశ్ మాట్లాడుతూ అంబేద్ర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. దేశంలో భిన్న మతాలు, కులాలు ఉన్నప్పటికీ అందరికీ సమాన హక్కులను కల్పించాలనే ఉద్దేశ్యంతో రాజ్యాంగం రచించిన మహానుభావుడు అంబేడ్కర్ అని అన్నారు. ప్రపంచంలో మరే దేశానికీ లేనంత గొప్పగా భారత రాజ్యాంగం ఉన్నదంటే, ఆ గొప్పదనం అంబేడ్కర్‌దేనని పేర్కొన్నారు. ఆయనను మనం ఎల్లపుడూ గౌవరవించాలి, ఆయన సేవలను స్మరించుకోవాలని కోరారు. ఇందుకోసం ప్రధాని, బీజేపీ పెద్దలు అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరపాలని నిర్ణయించారని ఆయన అన్నారు. అంతకుముందు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్‌తోపాటు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశివిశ్వనాధరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అయ్యాజి వేమా, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, అంబేద్కర్ జయంతి జిల్లా కన్వీనర్ ఆరుగుల కొండబాబు, కో-కన్వీనర్ రత్నభరత్, రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, పాయకరావుపేట అసెంబ్లీ కన్వీనర్ శ్రీరంగం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వితంతువులకు న్యాయం చేయండి

- వైసీపీ నేత వీసం రామకృష్ణ

నక్కపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత నుంచి అర్హులైన కొంత మంది వితంతువులకు పెన్షన్ ఇవ్వలేదని వైసీపీ నేత, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం. రామకృష్ణ అన్నారు. ఇప్పుడున్న కొత్త మార్గదర్శకాల వల్ల చాలా మందికి అన్యాయం జరుగుతోందని శుక్రవారం ఎంపీడీవో సీతారామ రాజును కలిసి ఆయన వినతిపత్రం అందించారు. భర్త మరణిస్తే, తక్షణమే అతని భార్యకు వితంతు పెన్షన్ ఇవ్వాలని, ఈ విషయంలో ఎటువంటి మెలికలు పెట్టకూడదని రామకృష్ణ అన్నారు. వితంతువులు బతకడానికి ఏ ఆధారం వుండదని, వాళ్లకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.

హోం మంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

నక్కపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో మత్స్యకార భరోసా పథకంలో భాగంగా వేట నిషేధ పరిహారాన్ని శనివారం మత్స్యకారులకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అందచేస్తారు. జిల్లాకు సంబంధించి నక్కపల్లిలో మంత్రి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. మండల పరిషత్ కార్యాలయం దగ్గర సభావేదికను ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం సీఐ కుమారస్వామి, ఎస్సై సన్నిబాబు సభా ప్రాంగణాన్ని, సభావేదిక నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీడీవో సీతారామరాజుతో మాట్లాడారు. వారి వెంట మత్స్యకార నాయకుడు చినతాతారావు ఉన్నారు.

ఫ్రైడే డ్రైడే పాటించాలి

పాయకరావుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మలేరియాపై శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడేను పాటించాలని పీహెచ్‌సీ వైద్దాధికారి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వీఎస్.సౌందర్య, వైద్య సిబ్బంది రమణ, నాగేశ్వరరావు, హెచ్‌వీ కె.వజ్రం, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నూకాంబిక జాతరకు ఏర్పాట్లు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గంధామవాస్య పురస్కరించుకుని ఆదివారం నూకాంబిక అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఆలయాన్ని, గ్రామంలోని పలు వీధులను లైటింగ్ సెట్టింగ్‌లతో అలంకరిచారు. మండలంలోనే అతి పెద్ద జాతరని, ప్రతీ ఏడాది ఇంటి ఆడపడుచులు, చుట్టాలతో పాటు పలు ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో జనాలు వచ్చి జాతర లో పాల్గొంటారని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరిగే ఈ జాతరలో రకరకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం మంగాదేవి పాట ఏర్పాటు చేయగా, 26 తేదీన జాగారం కావడంతో ఆరోజు రాత్రి చింతామణి నాటకం ప్రదర్శిస్తారని చెప్పారు. జాతరలో భాగంగా 27వ తేదీ ఉదయం నుంచి గ్రామంలో జరిగే నూకాంబిక అమ్మవారి ఊరేగింపు ను ఘనంగా జరుపుతామని కమిటీ చెప్పింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆలయం దగ్గర అన్నసమారాధన ఏర్పాటు చేశామని చెప్పారు.

'ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా పనులు జరగవు'

నక్కపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో నిర్మచబోయే కంపెనీల వివరాలు తెలియకుండా, ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా పనులు చేపట్టడం చాలా దారుణమని వైసీపీ మండల అధ్యక్షుడు శీరం. నర్సింహమూర్తి అన్నారు. శుక్రవారం రాజయ్యపేటలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో ప్రకృతి ఉనికికి హానికరమైన బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి ప్రజలంతా వ్యతిరేకంగా ఉన్నారని ఆయన చెప్పారు. భూములు ఇచ్చిన రైతులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. పరిశ్రమల పూర్తి వివరాలు తెలియజేయాల్సిన బాధ్యత అధికారుల పై ఉందని నరసింహమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రాయితీపై పశుదాణా పంపిణీ

నక్కపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల ప్రయోజనం కోసం పశువుల దాణాను 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తామని నక్కపల్లి పశు వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.వీర్రాజు చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం గుర్తించి పసుపు రంగు చెవిపోగులు ఉన్న పాడిపశువులను కలిగిన రైతులు లకు ఈ రాయితీ వర్తిస్తుందని చెప్పారు. మొదటి దశలో నక్కపల్లి మండలంలో ఎనిమిది టన్నులు ,ఎస్.రాయవరం మండలంలో పది టన్నులు, పశుదాణా రాయితీపై ఇస్తామని తెలిపారు. లబ్ధిదారులను గుర్తించే కార్యక్రమం జరుగుతోందని, రూ.1110 విలువ ఉన్న దాణా రూ.555 పాడి రైతులకు అందిస్తామని చెప్పారు.

సూర్యఘర్ పథకంతో ప్రజలకు మేలు

- ఏపీఈపీడీసీఎల్ ఏఈ గోపి

ఎస్.రాయవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం' వల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ గోపి తెలిపారు. శుక్రవారం దార్లపూడి గ్రామంలో ఆయన పర్యటించి 'పీఎం సూర్య ఘర్ పథకం' పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ సోలార్ వాడకం వల్ల కలిగే లాభాలను వివరించారు. కేంద్ర పభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పథకం ప్రయోజనాలు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నువ్వుల సాగుపై రైతులకు అవగాహన

కోటవురట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపేట గ్రామంలో శుక్రవారం నువ్వుల సాగు విస్తీర్ణంపై వ్యవసాయశాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. అవగాహన సదస్సులో కేవీకే హెడ్ డాక్టర్ శైలజ, పాయకరావుపేట వ్యవసాయ శాఖ ఏడీ ఉమాప్రసాద్, మండల వ్యవసాయాధికారి సరోజని హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నువ్వుల ఉత్పత్తి పెంచేందుకు రైతులు కొత్త రకం విత్తనాలను వేయాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు కొత్త రకాల విత్తనాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సాగులో అధిక దిగుబడి వస్తుందని వారు వివరించారు.

నేడు పందూరు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

కోటవురట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందూరు గ్రామంలో వంతెన నిర్మాణానికి రాష్ట్రహోంమంత్రి వంగలపూడి అనిత శనివారం శంకుస్థాపన చేస్తారని ప్రాజెక్టు డీఈఈ రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2016లో రూ.6 కోట్లతో అప్పటి పంచాయతీరాజ్ మంత్రి అయ్యన్నపాత్రుడు, వంగలపూడి అనిత ప్రారంభించారని చెప్పారు. నిధుల కొరత కారణంగా మధ్యలోనే ఆగిపోయిన పందూరు వంతెన మిగులు పనులను నాబార్డు నిధులు రూ.5.75 కోట్లతో తిరిగి శనివారం ఉదయం 9 గంటలకు మంత్రి శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు.

రేబాక ఆలయానికి పూజా సామగ్రి వితరణ

నక్కపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మతల్లి క్షేత్రానికి ఉద్దండపురం గ్రామానికి చెందిన ధాతారం మురళీకృష్ణ, విశ్వ మోహిని దంపతులు శుక్రవారం ఇత్తడి పూజా సామగ్రిని వితరణగా అందించారు. తిరుపతి పద్మావతి నగర్‌లోని రామాలయ అర్చకుడు గురురాజారావు సహా దూరప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు రేబాక గూడుపమ్మతల్లిని దర్శించుకున్నారు.

సంపద కేంద్రంలో తనిఖీలు

నక్కపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండపురం సంపద కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపద కేంద్రంలో సేంద్రియ ఎరువుల ఉత్పత్తులను పెంచాలని ఆదేశించారు. తడి, పొడి చెత్త ఏరివేత సకాలంలో చేపట్టాలని సూచించారు. మండలంలో సంపద కేంద్రాల పనితీరును డీపీవోకు ఎంపీడీవో సీతారామరాజు వివరించారు.

పహల్గాం ఘటనపై నిరసనల హోరు

▸ పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్ర మూకను మట్టుబెట్టాలి ▸ వారికి మద్దతుగా నిలుస్తున్న పాక్‌కు గుణపాఠం చెప్పాలి ▸ ముక్తకంఠంతో నినదించిన పౌరులు



అనకాపల్లి నెహ్రూచౌక్ కూడలిలో ఉగ్ర దాడిని ఖండిస్తూ నినాదాలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

పరవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో హిందువులపై జరిగిన ఉగ్ర దాడిని ఖండిస్తూ జనసేన పార్టీ ప్రకటించిన సంతాప దినాల కార్యక్రమంలో భాగంగా మూడో రోజు శుక్రవారం పరవాడ సినిమాహాల్ జంక్షన్‌లో కూటమి శ్రేణులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు హాజరై మాట్లాడారు. ఉగ్రవాదులు, వారికి సహకరిస్తున్న పాక్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. హిందువులను టార్గెట్ చేసి ఉగ్ర మూకలు కిరాతకంగా కాల్చి చంపడం దారుణమన్నారు. ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారందరికీ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మానవరపు అప్పలనాయుడు, పైలా జగన్నాధరావు, సర్పంచులు శిరపురపు అప్పలనాయుడు, బొద్దపు శ్రీనివాసకానులు, మోటూరు సన్యాసినాయుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, వియ్యపు చిన్న, దుల్ల రామునాయుడు, నగిరెడ్డి చిన్నారావు, పైలా వరలక్ష్మి , బొద్దపు అయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.



మౌనం పాటిస్తున్న డైట్ కళాశాల విద్యార్థినులు

నెహ్రూ చౌక్‌లో మానవహారం...

కొత్తూరు : ఉగ్రవాద దాడిలో మృతులకు శుక్రవారం రాత్రి అనకాపల్లిలోని నెహ్రూచౌక్ కూడలిలో కూటమి నాయకులు సంతాపం తెలిపారు. ముందుగా మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు దూలం గోపీ, ఆళ్ల రామచంద్రరావు, తాడి రామకృష్ణ, చదరం నాగేశ్వరరావు, గణేశ్, సందీప్, జోగేంద్ర, సుధ, ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని హతమార్చడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ దాడి చేసిన వారికి గుణపాఠం చెప్పాలని, అందుకు అంతా మద్దతుగా నిలుస్తామని ప్రకటించారు. ఈ మానవహారంలో ముస్లిం మత పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

డైట్ కళాశాలలో...

అనకాపల్లి టౌన్ : పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన పర్యాటకులకు ఇక్కడి డైట్ కళాశాల విద్యార్థులు శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ ఉగ్ర దాడిని ఖండించారు. అనంతరం మౌనం పాటించి, అంజలి ఘటించారు.



పరవాడ సినిమాహాల్ జంక్షన్‌లో చేపట్టిన నిరసన ర్యాలీలో ఎమ్మెల్యే పంచకర్ల తదితరులు

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



ఆది దంపతులకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రిల వేదమంత్రాల నడుమ కాండ్రేగుల మురళీకృష్ణ, చంద్రకళ దంపతులు ఊంజల్ సేవను జరిపారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని బృంద సభ్యుల కోలాటాలు, కీర్తనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అనకాపల్లిలో హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ సీఎం రమేష్, తదితరులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం జరిగే హనుమాన్ శోభాయాత్ర పోస్టర్‌ను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డీడీ నాయుడు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు సుంకరమెట్ట జంక్షన్ నుంచి ప్రారంభం కానుంది. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డీడీ నాయుడుతో పాటు విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఆరోగ్య కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలి'



పీహెచ్‌సీ వైద్యులతో మాట్లాడుతున్న క్షయ నివారణాధికారి డాక్టర్ బాలాజీ

కశింకోట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని శతశాతం సాధించాలని అనకాపల్లి జిల్లా అదనపు లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణాధికారి డాక్టర్ ఎంవీఎస్‌కే బాలాజీ పిలుపునిచ్చారు. తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించిన అనంతరం వైద్యులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారిణి డాక్టర్ ఎ.మనీషా, వీపీ సుబ్బారావు, ఆరోగ్య విస్తరణాధికారి ఎంఎస్‌వీ ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కేఎస్ ఆర్‌కేజీ నరసింహారావు, ఆర్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచాలని ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల ధర్నా



డిపో ఎదుట ధర్నా చేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జీతాలు పెంచాలని కోరుతూ ఇక్కడి ఆర్టీసీ డిపో ఎదుట అద్దె బస్సుల డ్రైవర్లు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఏపీఎస్ ఆర్టీసీ కాంట్రాక్టు వర్కర్స్, అద్దె బస్సుల డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో కనీస వేతనాలు అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాడ్యూటీ అమలు చేయాలని, యూనిఫాం అలవెన్సులు ఇవ్వాలని నినాదాలు చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ 2022లో అద్దె బస్సుల యాజమానుల సంఘం చేసిన ఒప్పందం కాల పరిమితి ముగిసి ఆరు నెలలు కావస్తున్నా జీతాలు పెంచకపోవడం దారుణమన్నారు. ఒకపక్క నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పాటు విద్యా, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో తక్షణమే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎంపీ నాయుడు, చిన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పరవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభు త్వం అందిస్తున్న రాయితీ రుణాల కోసం అర్హులైన వారంతా దరఖాస్తులు చేసుకోవాలని పరవాడ ఎంపీ డీవో కె.ధర్మారావు కోరారు. మండలానికి పదకొండు యూనిట్లు కేటాయించారని, ఆసక్తి గల వారు వచ్చే నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవా లని సూచించారు. మరిన్ని వివరాలకు మం డల పరిషత్ కార్యాలయాన్ని పనిదినాల్లో సంప్రదించాలన్నారు.

28 నుంచి ఉత్తరాంధ్ర స్థాయి క్రికెట్ పోటీలు

పరవాడ, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెంలో మరిడిమాంబ ఉత్సవాల సందర్భంగా ఆర్‌కే రాయల్స్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి ఉత్తరాంధ్ర స్థాయి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందించనున్నామన్నారు. పూర్తి వివరాలకు 98663 99738 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

తాళ్లపాలెంలో టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక



ఎన్నిక అనంతరం బాధితునికి సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్న సురేంద్ర

కశింకోట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ముఖ్య అతిథిగా హాజరై ఎన్నిక జరపగా, ఉల్లింగల రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్‌ను సుందరపు పెద అప్పారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగురైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, నాయకులు ఉగ్గిన రమణమూర్తి, కడిమిశెట్టి నరసింహారావు, కలగా సోమేశ్వరరావు, ద్వారపూడి సత్తిబాబు, నయనంశెట్టి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

టమాటాను విశాఖ రైతు బజార్లలో విక్రయించేలా అనుమతి ఇవ్వాలి

▸ జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ ఆఫీసర్‌కు రైతు సంఘం వినతి



అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ అధికారికి వినతిని అందిస్తున్న రైతు నాయకులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల రైతులు పండించే టమాటా పంటను విశాఖపట్నం రైతు బజార్లు, ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు అనుమతులు ఇవ్వాలని రైతు సంఘం నాయకులు శుక్రవారం జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారిని కోరారు. ఈ మేరకు ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని సిరసపల్లి, వల్లూరు, గొర్లివానిపాలెం, మునగపాక మండలం గవర్ల అనకాపల్లి రైతులు టమాటాను ఎక్కువగా పండిస్తున్నారన్నారు. చాలా కాలంగా విశాఖపట్నం రైతు బజార్లకు, ఇతర ప్రాంతాలకు ఇక్కడి పండ్లను విక్రయించేవారన్నారు. ఇటీవల కాలంలో విశాఖపట్నం వ్యవసాయాధికారులు చిత్తూరు నుంచి వచ్చే టమాటాలు అమ్ముతున్నారన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి ఉమ్మడి జిల్లాలుగా ఉన్నప్పటి నుంచి విశాఖ రైతు బజార్లలో టమాటాలు విక్రయించడం జరుగుతున్నట్టు చెప్పారు. అనకాపల్లి జిల్లా నుంచి వచ్చే కూరగాయలు, టమాటాలను రైతులు అమ్ముకోవడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తరువాత ఇతర జిల్లాలవారికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రతినిధులు గండి నాయనబాబు, కె.తేలయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్‌కు కలెక్టర్ అభినందన



వెంకటజయను అభినందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

పరవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి జిల్లా టాపర్‌గా నిలిచిన పెదముషిడివాడ హైస్కూల్ విద్యార్థిని ఆర్సి వెంకటజయను గురువారం రాత్రి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తన ఛాంబర్‌లో అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు, విద్యార్థిని తల్లిదండ్రులు గంగరాజు, మహేశ్వరి, రిటైర్డు ఆర్మీ ఉద్యోగి ఆర్సి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

రోలుగుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బావిలో వృద్ధురాలు పడి మృతిచెందిన ఘటన రోలుగుంటలో శుక్రవారం చోటుచేసుకుంది. దీనిపై ఎస్ఐ రామకృష్ణారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. రోలుగుంటకు చెందిన కామిరెడ్డి ఎర్రయ్యమ్మ(80) కొంతకాలంగా తన అల్లుడైన ఎం.సత్తిబాబు వద్ద ఉంటున్నది. ఇటీవల ఆమెకు మతిస్థిమితం లేక అటు ఇటూ తిరుగుతూ ఉంటుంది. దీనిలో భాగంగానే గురువారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి నుంచి బయటకు వెళ్లిన ఎర్రయ్యమ్మ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతకసాగారు. శుక్రవారం ఉదయం కొవ్వూరు వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న బావిలో ఆమె మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. ప్రమాదవశాత్తు జారిపడి మరణించినట్టు గుర్తించామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. మృతురాలు అల్లుడు సత్తిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఐదేళ్ల క్రితం పరారైన గంజాయి నిందితుడి అరెస్టు

గొలుగొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా కేసులో ఐదేళ్ల క్రితం పరారైన నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. గొలుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021 సంవత్సరంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి గంజాయి రవాణా సాగిస్తున్న వ్యక్తి బైక్‌ను వదిలి పరారీ అయ్యాడు. బైక్ రికార్డుల ఆధారంగా నిందితుడు వంతల సుందరరావు చింతపల్లి మండలం దేగలపాలెం పంచాయతీ శివారు కొత్తపాపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అప్పుడు 36 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టి ఒడిశా రాష్ట్రంలో అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న గొలుగొండ ఎస్ఐ రామారావును, సిబ్బందిని జిల్లా ఎస్పీ, నర్సీపట్నం డీఎస్పీ అభినందించారు.

'సహకార' సేవలపై విస్తృత ప్రచారం

▸ సిబ్బందికి డీసీవో ప్రేమ స్వరూపారాణి సూచన

సబ్బవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాల ద్వారా సాధారణ ప్రజలకు అందే సేవలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా సహకార అధికారిణి (డీసీవో) ఎ.ప్రేమస్వరూపారాణి సూచించారు. ఇక్కడి దుర్గామాంబ పీఏసీఎస్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా సేవలు అందించేందుకు సహకార సంస్థల్లో ఆన్‌లైన సేవలు ప్రారంభించినట్టు చెప్పారు. తొలుత ఆమె వైద్య పరీక్షలను చేయించుకున్నారు. సంస్థ సీఈవో మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి 212 మంది వచ్చి వైద్య సేవలు పొందినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సహకార అధికారిణి పీఎల్ఎన్ కిరణ్‌కుమారి, డీఏసీ పి.వి.ఎస్.రావు, సీఈవో గొంప రమణ, సంస్థ మాజీ అధ్యక్షులు బొండా సత్యారావు, డాక్టర్ చక్రవర్తిలతో పాటు పలు ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీసీవో ప్రేమస్వరూపారాణి

పంటల సాగుపై రైతులకు అవగాహన



మట్టిని ప్రయోగశాలకు పంపేందుకు సిద్ధం చేస్తున్న వ్యవసాయాధికారులు

కొత్తూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సీతానగరంలో పంటల సాగు పద్ధతులపై రైతులకు శుక్రవారం వ్యవసాయాధికారులు అవగాహన సదస్సుల నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీ రామారావు మాట్లాడుతూ శాస్త్రీయంగా నేలలో 6-8 సెంటీ మీటర్ల లోతు నుంచి మట్టి నమూనాలను సేకరించి ఇస్తే వాటిని ప్రభుత్వ మట్టి శాస్త్ర ప్రయోగశాలకు పంపుతామన్నారు. పరీక్షల ద్వారా మట్టిలో పోషకాల సమాచారం రైతులకు తెలియజేస్తామని వివరించారు. ఈ సమాచారం ఆధారంగా రైతులు పంటల సాగును ఎంచుకోవచ్చునన్నారు. సాగు కాలానికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యసాయాధికారి రంగాచారి, గ్రామ వ్యవసాయ సహాయకులు జ్యోతిమోహన్, రైతులు తెల్లాకుల ప్రకాష్, బుద్ద శంకరరావు, తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై ఫ్లైయాష్, బొగ్గు తొలగింపు

లంకెలపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం కూడలి నుంచి ఫార్మాసిటీ రవాదారిలో పేరుకుపోయిన బొగ్గు, ఫ్లైయాష్ బుడిద తొలగింపునకు జీవీఎంసీ అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. నిత్యం లారీల్లో పరిమితికి మించి బొగ్గు, ఫ్లైయాష్ రవాణా చేస్తుండడంతో ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున జారి పేరుకు పోయాయి. వాహనాల వేగానికి వెనుక వచ్చే ద్విచక్ర వాహనచోదకుల కళ్లలోకి ఇవి ఎగసి పడుతుండడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని స్థానికులు వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి చర్యలు చేపట్టారు. పేరుకు పోయిన బొగ్గు, బుడిదను దగ్గరుండి జీవీఎంసీ సిబ్బందితో తొలగించే పనిని చేపట్టారు.



రహదారిపై భారీగా పేరుకు పోయిన బూడిద, బొగ్గును తొలగిస్తున్న దృశ్యం

మలేరియాపై అవగాహన ర్యాలీలు



అనకాపల్లిలో ర్యాలీని ప్రారంభించిన డీఆర్‌వో సత్యనారాయణరావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలుచోట్ల వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయం నుంచి జరిగిన ర్యాలీని డీఆర్‌వో సత్యనారాయణరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చిన 'మలేరియా అంతం మనతోనే' అనే నినాదంతో ముందుకు సాగాలని సూచించారు.ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా ర్యాలీ సాగింది. జిల్లా మలేరియా అధికారి వరహాలదొర, డీఎంహెచ్‌వో ఎం.శాంతి ప్రభ, లతో పాటు నర్సింగ్ విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తుమ్మపాల : ఇక్కడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది పంచాయతీ పరిధిలో కరపత్రాలు పంచిపెట్టి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామ నాయకులు చదరం నాగేశ్వరరావు, విల్లూరి చంద్రశేఖర్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : మండల కేంద్రం కశింకోట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు తిరుపతిరావు, సునీల్‌మలేరియాపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పరవాడ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా జీవించడం సాధ్యమని పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ జయశ్రీ కరిష్మా అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో మాట్లాడారు. వైద్యురాలు హారిక, సీహెచ్‌వో సాయిరాం, జానకిరామన్, సిబ్బంది పాల్గొన్నారు. వాడచీపురుపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు వి.కనక అప్పారావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్బవరం : మలేరియా రహిత సమాజ నిర్మాణానికి అంతా కృషి చేయాలని స్థానిక పీహెచ్‌సీ ప్రధాన వైద్యులు డాక్టర్ సీహెచ్.చక్రవర్తి పిలుపునిచ్చారు. మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించిన సందరంగా మాట్లాడారు.డాక్టర్ స్వర్ణలత, ఐసీటీసీ రాజశేఖర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పరవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో...



కశింకోట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..



తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో...



సబ్బవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో...

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం: ఎమ్మెల్యే



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరమని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. శుక్రవారం మండలంలోని ఎగువశోభ పంచాయతీ పోర్నపోదోర్ గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తితో మెలగాలని సూచించారు. అలాగే గిరిజన గ్రామాల్లో సారా, గంజాయి రవాణా నిరోధించాలన్నారు. ఈ కార్యక్రమంలోని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, సర్పంచులు సింహాద్రి, మోస్య, కుమార్, మట్టం శ్యామ్, రంజిత్, సుబ్బారావు, దాసు, రాజు, అనిల్, చిట్టం మురళి, తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారు

సీలేరు, ఏప్రిల్ 25 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు గ్రామ దేవత శ్రీ మారెమ్మ అమ్మవారి 53 వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చనలను నిర్వహించారు. అన్నవరానికి చెందిన అమ్మవారి భక్తుడు ఎంకేటీఎస్‌వీ ప్రసాద్ వారి మిత్ర బృందం ఆర్థిక సహాయంతో ఈ పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. కుంకుమార్చన కార్యక్రమం అనంతరం సహస్ర దీపాలంకరణ చేపట్టారు. ఈ పూజల్లో సీలేరు, పరిసర గ్రామాల మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఎస్ఈ, మారెమ్మ ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు బి చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి , ఆలయ కమిటీ సభ్యులు కారే శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతపల్లిలో నిరంతర తాగునీటి సరఫరా



నీటి ట్యాంక్‌లను ప్రారంభిస్తున్న ఏఈఈ స్వర్ణలత, సర్పంచ్ పుష్పలత

చింతపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రజలకు ట్యాంకర్లతో నిరంతర నీటి సరఫరా చేస్తున్నట్టు స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ స్వర్ణలత అన్నారు. శుక్రవారం నీటి ట్యాంకర్లను సర్పంచ్ దురియా పుష్పలతతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఏఈఈ మాట్లాడుతూ జాతరలో స్థానిక ప్రజలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల కోసం ఏడు ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ దురియా పుష్పలత, కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు అదనపు సిబ్బంది

మండల కేంద్రంలో పారిశుధ్యం మెరుగుకి అదనపు సిబ్బందిని నియమించినట్టు జీకేవీధి ఈవోఆర్‌డీ పాపారావు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రధాన రహదారులు, జాతర వేదిక పరిసరాలను శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఈవోఆర్‌డీ మాట్లాడుతూ ముత్యాలమ్మ జాతరలో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు జీకేవీధి, చింతపల్లి మండలాల నుంచి అదనపు పారిశుధ్య కార్మికులను నియమించామన్నారు. ఈ కార్మికులు 24గంటలు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దురియా పుష్పలత, కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో ఆధార్ సేవలు



పోస్టల్ అధికారి దిలీప్

పాడేరురూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తపాలాకార్యాలయంలో అందుబాటులోకి వచ్చిన ఆధార్ సేవలను గిరిజన ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖాధికారి దిలీప్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో తపాలా కార్యాలయంలో తాత్కాలికంగా నిలిపిన ఆధార్ సేవలను పునరుద్ధరించినట్టు చెప్పారు. లబ్ధిదారులు తపాలా కార్యాలయానికి వచ్చి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



అరకులోయంలో ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు



జాతీయ జెండాతో ఉగ్రదాడిని ఖండిస్తున్న ముస్లింలు

ఉగ్రవాదాన్ని అంతమొందించాలి

» పర్యాటకుల హత్యా కాండపై పెల్లుబికిన నిరసనలు

అరకులోయ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదులు పర్యాటకులను హతమార్చడానికి వ్యతిరేకంగా శుక్రవారం అరకులోయలో జనసేన పార్టీ నాయకులు, మసీదుకమిటీ ప్రతినిధులు వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మృతులకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం వ్యక్తంచేశారు. సైనిక దుస్తులు ధరించిన ఉగ్రవాదులు పర్యాటకులను అతి కిరాతంగా తుపాకీలతో కాల్చి చంపడం అత్యంత హేయమైన చర్య అని అరకు అసెంబ్లీ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి శెట్టి చిరంజీవి ఈ సందర్భంగా ఖండించారు. ఈ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉమ్మడి జిల్లా రూరల్ కార్యదర్శి ముల్లంగి శ్రీనివాసరెడ్డి, అరకు నియోజకవర్గ పరిధిలోని ఆ పార్టీ అధ్యక్షులు గునేశ్వరావు, కోట్వేరరావు, పడాల్, రాంబాబు, పెదలబుడు పంచాయతీ మాజీసర్పంచ్ సమర్డి రఘునాథ్, మాజీ ఉప సర్పంచ్ సత్యానందం, జనసేన నేత,న్యాయవాది సుంకరి ఆనంద్, పార్టీ ప్రతినిధులు రవీంద్ర, చెట్టి ఆనంద్ అప్పన్న, చిన్న తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదీయ మసీదు కమిటీ ఆధ్వర్యంలో నివాళి

కశ్మీర్‌లో 28 మంది పర్యాటకులను పొట్టనపెట్టుకున్న ఉగ్రదాడిని ఖండిస్తూ మహమ్మదీయ మసీదు మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్య క్రమం చేపట్టారు. మసీద్‌లో నమాజ్ అనంతరం కమిటీ అధ్యక్షుడు, గురువు హైదర్ అలీ ఈ సందర్భంగా మాట్లాడారు. తీవ్రవాదాన్ని నిర్మూలించాలని డిమాండ్ చేశారు. మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గురువు బాషా, ఎస్‌కే రహమాన్, బషీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కొయ్యూరులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన పార్టీ నాయకులు

కొయ్యూరు: పర్యాటకుల ప్రాణాలను ఉగ్రవాదులు అతి క్రూరంగా బలిగొనడం హేయమైన చర్యని జనసేన మండల నేతలు పేర్కొన్నారు. ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మశాంతికి శుక్రవారం సాయింత్రం కొయ్యూరులో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నేతలు లక్ష్మణ రావు, బుజ్జిబాబు, శేషుబాబు, నాగేంద్ర, శ్రీనుబాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కవలలూ.. ఒకేలా మార్కులు!



కవలలు లక్ష్మణ్, రాములు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆ కవల అన్నదమ్ములది ఒకేలా రూపం... పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కూడా ఒకేలా చాటారు. ఇటీవల వెలువడిన టెన్త్ ఫలితాల్లో ఒకే మార్కులు వచ్చాయి. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివరాలివి.. మండలంలోని మాకవరం పంచాయతీ కుమ్మరివీధి గ్రామానికి చెందిన జి.జలబొందు, బృంద దంపతులకు కవలపిల్లలు. పెద్ద కుమారుడు పేరు లక్ష్మణ్, చిన్నకుమారుడు రాము. ఈ ఇద్దరూ ముంచంగిపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1 లో చదివారు. గత మార్చిలో పదో తరగతి పరీక్షలు రాశారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఇద్దరూ ఒకేలా 349 మార్కుల చొప్పున సాధించారు. ఒకే రూపమే కాదు.. ఒకేలా మార్కులు రావడంతో వారు సంబరపడుతున్నారు.

మీకోసం కార్యక్రమానికి 104 వినతులు

పాడేరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గిరిజనులు తమ సమస్యలపై 104 వినతులను సమర్పించారు. కలెక్టర్ దినేశ్‌కుమార్, జేసీ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ వేర్వేరు కార్యక్రమాల్లో ఉండడంతో సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మావతి, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు వినతిపత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు కె.వేణుగోపాల్, జి.డేవిడ్‌రాజు, డ్వామా పీడీ విద్యాసాగర్, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, టీడబ్ల్యూ డీడీ ఎల్.రజని, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, పశు సంవర్ధక శాఖ డీడీ నరసింహులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

పాడేరురూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని 8 గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశాలకు 2024-25లో ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులైన గిరిజన, గిరిజనేతర విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఎంజే.అభిషేక్ గౌడ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీతో పాటు ఒకేషనల్ కోర్సులైన ఏఅండ్‌టీ, సీజీఏ కోర్సులలో చేరేందుకు ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 18వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.పూర్తి వివరాలకు జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ యండమూరి పారయ్య ఫోన్: 9490957224, లేదా గురుకులం ఓఎస్‌డీ పీఎస్ఎన్.మూర్తి 9493758072 నంబర్లకు సంప్రదించాన్నారు.

గిరిజన చట్టాల పరిరక్షణలో కలెక్టర్ విఫలం

» దండకారణ్య విమోచన సమితి నేతల ఆరోపణ

» అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యకు డిమాండ్

పాడేరు, ఏప్రిల్ 25(ఆలంధ్రజ్యోతి): ఏజెన్సీలో గిరిజన చట్టాల పరిరక్షణలో కలెక్టర్ దినేశ్‌కుమార్ విఫలమయ్యారని దండకారణ్య విమోచన సమితి(డీఎల్‌వో) నేతలు ఆరోపించారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎల్‌వో రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర మార్క్‌రాజు, ప్రధాన కార్యదర్శి కొండపల్లి కాంతారావు మాట్లాడారు. గిరిజన సమస్యలపై కలెక్టర్ వివిధ గిరిజన సంఘాలతో గత జనవరి 9న నిర్వహించిన సమావేశంలో అనేక అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లామని, కాని నేటికీ 105 రోజులవుతున్నా వీటిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ప్రస్తుతం ఐఏఎస్ అధికారులు అందుబాటులో ఉన్నా పాలన గాని, గిరిజన చట్టాలు అమలుగాని గతంలోలా జరగకపోగా, అక్రమాలు, అవినీతి అధికమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీడీఏ కార్యాలయంలో ఏపీవోలు వెంకటేశ్వరరావు, ఏవో హేమలత అక్రమాలకు పాల్పడుతున్నారని, అలాగే గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ రజని, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ డీఈఈ జి.నరేన్‌కుమార్, అరకులోయ ఏరియా ఆస్పత్రిలోని హెడ్‌నర్స్ స్వర్ణలత ఏళ్ల తరబడి పాతుకుపోయి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చింతపల్లి తాహసీల్దార్ రవికుమార్ భూ చట్టాలను అతిక్రమిస్తూ గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. గిరిజనులకు గతంలో జారీ చేసిన ఎల్‌పీసీలను సైతం రద్దు చేస్తున్నారని తెలిపారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, షెడ్యూల్ ప్రాంతాల్లో శత శాతం ఉద్యోగాలు గిరిజనులకే దక్కేలా చట్టం చేయాలన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ తీరుకు నిరసనగా ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌వో నేతలు అప్పారావు, మచ్చమ్మ, వెంకాయమ్మ, ధారలమ్మ, కాసులమ్మ, కొత్తయ్య, సూరిబాబు, శేషాద్రి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ తీరుకు వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలను ప్రదర్శిస్తున్న డీఎల్‌వో నేతలు

అంబేడ్కర్ యువతకు ఆదర్శం

పాడేరురూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): యువత రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బీఆర్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని 20 సూత్రాల పథకాల అమలు చైర్మన్ లంక దినకర్ పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి ఆధ్వర్యంలో స్థానిక మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా దినకర్, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జి.దేవానంద్‌లు మాట్లాడుతూ అంటరాని తనానికి వ్యతిరేకంగా అంబేడ్కర్ పోరాటం చేశారన్నారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ వాడుకొని ఎన్నికల్లో ఓడించేందుకు ప్రయత్నం చేసిందన్నారు. వాజ్‌పేయి, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలనలో అంబేడ్కర్‌కు సముచిత స్థానం కల్పించి భారతరత్న ఇచ్చారన్నారు. అనంతరం దినకర్‌ను నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పి.రాజారావు, కె.కృష్ణారావు, పి.రవికుమార్, ఎస్.రామకృష్ణ, రాఘవేంద్రరావు, కె.వెంకటరమణ పాల్గొన్నారు.

కడుతులలో పశు వైద్య శిబిరం

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పనసపుట్టు పంచాయతీ కడుతుల గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో గత వారం రోజుల వ్యవధిలో సుమారు 12 మూగజీవాలు మృతి చెందాయి. ఈ నేపథ్యంలో పశు వైద్య అధికారులు స్పందించారు. పశువులకు వైద్య సేవలు అందించారు. 64 పశువులకు గొంతు వాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశు వైద్యాధికారి బి.రవి, సిబ్బంది ఎస్.ధర్మారావు, రాజుబాబు, రామ్‌నాయుడు, రమేశ్, అప్పలరాజు పాల్గొన్నారు.

సీలేరులో చలివేంద్రం ఏర్పాటు

సీలేరు, ఏప్రిల్ 25 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రంను శుక్రవారం సర్పంచ్ పి దుర్గో, కార్యదర్శి పరశురామ్ ప్రారంభించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బాటసారుల దాహన్ని తీర్చడానికి దీనిని ఏర్పాటుచేసినట్టు కార్యదర్శి చెప్పారు. కూటమి నాయయకులు చిటికెల రాము, కె సన్యాసిరావు, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, అప్పారావు, ఎం. సత్తిబాబు , మారిబాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీఆర్ఎస్ సెట్, ఏపీఆర్ జేసీ, డీసీ ప్రవేశ పరీక్షలు



ఏపీఆర్ఎస్ సెట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యాధికారులు

పాడేరురూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పాడేరులో నిర్వహించిన ఏపీఆర్ఎస్ సెట్, ఏపీఆర్ జేసీ, ఏపీఆర్‌డీసీ (ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాలు) ప్రవేశ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ముగిసినట్టు డీఈవో పి.బ్రహ్మాజీరావు, అసిస్టెంట్ కమిషనర్ (పరీక్షలు) ఆర్.శశికుమార్ తెలిపారు. 5, 6, 7, 8వ తరగతులకు సంబంధించి ఏపీ ఆర్ఎస్ సెట్ పరీక్షను శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 12వరకు కుమ్మరిపుట్టు ఏపీఆర్ బాలికల పాఠశాల, శ్రీకృష్ణాపురం బాలికల పాఠశాల, తలారిసింగి బాలుర పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో నిర్వహించినట్టు చెప్పారు. ఆయా కేంద్రాలలో ఈ పరీక్షలకు 312 మందిని కేటాయించగా 176 మంది (56.41)శాతం హాజరయ్యారని, మిగిలిన 136 మంది గైర్హాజరయ్యారు. అలాగే, అవే పరీక్ష కేంద్రాలలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరిగిన ఏపీఆర్ జేసీ, ఏపీఆర్ డీసీ ప్రవేశ పరీక్షలకు 843 మంది (ఇంటర్, డిగ్రీ)విద్యార్థులకు పరీక్షలు కొనసాగాయన్నారు. 591 మందిలో (70.11)శాతం మంది హాజరుకాగా 252 మంది గైర్హాజరైనట్టు తెలిపారు.

రైల్వే పనులతో బీర్జిగుడ- బొర్రా రోడ్డు ఛిద్రం

» పునర్నిర్మించాలని గిరిజనుల నిరసన



ఆందోళన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

అనంతగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీర్జిగుడ నుంచి బొర్రా రోడ్డు వరకు గల రహదారి అధ్వానంగా మారింది. దీంతో ఈ మార్గంలోని బీర్జిగుడ, పోర్నపోదర్ గ్రామాల ప్రజలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ యువ నాయకులు మట్టం శ్యామ్, గ్రామపెద్ద కుమార్ మాట్లాడుతూ.. బీర్జిగుడ వద్ద రైల్వే టెన్నెల పనులకు సంబంధించి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఈ రోడ్డంతా గోతులపడి అధ్వానంగా మారిందన్నారు. దీంతో గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. గిరిజన సంక్షేమశాఖ నిధులు రూ. 6.18 కోట్లతో గత ప్రభుత్వం ఈ మార్గంలో బీటీ రోడ్డు వేశారు.. అయితే, రైల్వేశాఖ రెండోలైన్ పనులకు సంబంధించి భారీ యంత్రాలు, అధికలోడ్లతో లారీలు రాకపోకలతో బొర్రా రోడ్డు నుంచి బీర్జిగుడ వరకు రోడ్డంతా అధ్వానంగా మారినట్టు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థినులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: ఆర్‌జేడీ



ఆర్‌జేడీ శోభారాణి తో మర్రిపాలెం డిగ్రీ కళాశాల విద్యార్థినులు

కొయ్యూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు భవిష్యత్తుప్రణాళికతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి, గురువులకు, తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కళాశాల రీజనల్ జాయింట్ డైరెక్టర్ శోభారాణి సూచించారు. శుక్రవారం ఆర్‌జేడీ మర్రిపాలెం మహిళ డిగ్రీ కళాశాలను ఆ కస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. పలు సమాధానాలకు సంతృప్తి చెందారు. ఇటీవల పదోన్నతి పొందిన కళాశాల ప్రిన్సిపాల్ సుధ సమర్ధతతోపాటు, అంకిత భావంతో పనిచేసే విద్యావేత్త అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వసతి గృహం, కళాశాలలో వసతి సమస్యలు పరిష్కరించాలని ఆర్‌జేడీని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్‌జేడీను సిబ్బంది విద్యార్థినులు సత్కరించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి నాబార్డు సహకారం



మాట్లాడుతున్న నాబార్డ్ డీడీఎం చక్రధర్

పాడేరురూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో మహిళలు ఆర్థికాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ డీడీఎం చక్రధర్ కోరారు. మండలంలోని వంజంగి పంచాయతీ కేంద్రంలో సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ (సీపీఎఫ్) సంస్థ ఆధ్వర్యంలో వంజంగి బోలింగమ్మ తల్లి మహిళా సంఘం ద్వారా శుక్రవారం ప్రారంభించిన చిరుధాన్యాల ప్రోసెసింగ్, అడ్డాకులతో ప్లేట్ల తయారీ యూనిట్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారుజడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, పంచాయతీ సర్పంచ్ వంతాల బొంజుబాబు, సీపీఎఫ్ సంస్థ ప్రోగ్రాం అధికారిణి ఎ.నాగమణి, పెసా మండల కమిటీ అధ్యక్షుడు వి.రమేశ్‌నాయుడు, మహిళలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి

సీలేరు, ఏప్రిల్ 25 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో మారెమ్మ ఉత్సవాలు పురస్కరించుకుని యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం స్థానిక ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ బి. చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ముందుగా జెన్‌కో అధికారులు, గామ పెద్దలు, క్రీడాకారులు కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలంటూ మౌనం పాటించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెన్‌కో ఈఈ రాజేంద్రప్రసాద్, ఈఈ శ్రీనివాసరెడ్డి, ఏడీఈ దుర్గాశ్రీనివాస్, ఏఈ సురేశ్, సర్పంచ్ పి దుర్గో, ఉప సర్పంచ్ కె వల్లీప్రసాద్ ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, బాలా జీ రెసిడెన్సీ యజమాని నక్కా జ్ఞానేశ్వరరావు, కూటమి నాయకులు సన్యాసిరావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగుకు దూరంగా ఉండాలి



ర్యాలీలో మాట్లాడుతున్న ఏవో

చింతపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు గంజాయి సాగుని విడిచిపెట్టాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పోలీసులు, వివిధశాఖ అధికారులతో కలిసి వ్యవసాయశాఖ గంజాయికి వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా వల్ల యువత విలువైన జీవితాలను నాశనం చేసుకుంటుందన్నారు. ఆదివాసీలు గంజాయి సాగును విడిచిపెట్టి వ్యవసాయ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి. రామకృష్ణ, ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, పశుసంవర్ధక ఏడీ డాక్టర్ చంద్రశేఖరరావు, ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దుకు పోరాటం: సీఐటీయూ

పాడేరురూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాసేందుకు తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకు మే డే స్ఫూర్తితో పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులు, చట్టాలను కాలరాసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. సీఐటీయూ నాయకులు ఎల్.సుందరరావు, శంకరరావు, భగత్‌రామ్, సత్యనారాయణ, అంగన్వాడీ, ఆశ, గ్రామ వలంటీర్స్, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్, జీసీసీ హమాలీలు, భవన నిర్మాణరంగ , హాస్టల్ వర్కర్స్ కాఫీ కార్మిక సంఘ తదితర రంగాల కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

అవగాహనతోనే మలేరియా నియంత్రణ

అనంతగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోటలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రూప్‌చంద్ ఆధ్వర్యంలోని జాతీయ మలేరియా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇళ్లకు సమీపంలోని వాడుక నీరు నిల్వలేకుండా చూడాలని, వాడిపడేసిన టైర్లు ఉంచకూడదన్నారు. దోమ తెరలను వాడాలన్నారు. ఎంపీహెచ్ఈవో గంగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ రవి, సబ్‌యూనిట్ అధికారి బాబురావు, రామకృష్ణ, శ్రీదేవి తపాల్గొన్నారు.

చింతపల్లి: గిరిజన గ్రామాల్లో మలేరియా నియం త్రణకు ప్రజలు సహకరించాలని కోరుకొండ ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని చింతపల్లి, కోరుకొండ, లోతుగెడ్డ, తాజంగి పీహెచ్‌సీల పరిధిలో సబ్ యూనిట్ అధికారి బుక్కా చిట్టిబాబు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ దోమలతోనే మలేరియా వ్యాధి సోకుతుందన్నారు. జ్వరం సోకిన వెంటనే ఆస్పత్రిలో నిర్ధారణ పరీక్షలు చేయించుని మందులు వాడాలన్నారు. ఆలస్యం చేస్తే ప్రాణహాని కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక, పశుసంవర్ధశాఖ ఏడీ డాక్టర్ చంద్రశేఖరావు, తహసీల్దార్ బి. రవి కుమార్, వైద్యాధికారులు సౌమ్య, శివ ప్రసాద్, పశువైద్యాధికారి చల్లంగి చాలిని, ఎంటీఎస్ ఉగందరావు, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో..



కొయ్యూరు మండలం రాజేంద్రపాలెంలో ర్యాలీ

సీలేరు: జీకేవీధి మండలం సీలేరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ నుంచి మార్కెట్ సెంటర్ వరకు మలేరియా దినోత్సవ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎస్‌కె మస్తాన్‌వల్లీ మలేరియా వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. చలితో కూడిన జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి రక్త పరీక్షలను చేయించుకుని మలేరియాగా నిర్ధారణ అయితే మందులు వాడాలన్నారు. వైద్యాధికారి కె సౌమ్య, హెచ్ఎస్ త్రినాధ్ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న అధికారులు, వైద్య సిబ్బంది

కొయ్యూరు: మలేరియా కారక దోమలు వృద్ధి చెందకుండా పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాజేంద్రపాలెం డౌనూరు పీహెచ్‌సీల వైద్యాధికారులు సంపత్‌బాబు, లలిత, రాజేంద్రపాలెం పీహెచ్‌సీ సీహెచ్‌వో ప్రశాంత్ సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించి ఆయా పీహెచ్‌సీల పరిధిలో శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. రెండు పీహెచ్‌సీల సిబ్బంది పీహెచ్ఎన్ భవాని, హెచ్‌వీ భూలోక, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

గూడెంకొత్తవీధి: సీజనల్ వ్యాధులపై గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని పెదవలస పీహెచ్‌సీ వైద్యాధికారి పృధ్వీష అన్నారు. నేరళ్లబందలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌వో బాలరాజు, హెచ్ఏ అచ్యుత్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మలేరియా నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కిలగాడ పీహెచ్‌సీ డాక్టర్ శిరీష అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ముంచంగిపుట్టు సీహెచ్‌సీ, కిలగాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బందిఅవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు.



ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నినాదాలు చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

ఉగ్రదాడిపై కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన

నర్సీపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఐద్వా, సీఐటీయూ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మినీ స్టేడియం గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్, ఐద్వా నాయకులు మాట్లాడుతూ దాడులు జరిగే ప్రదేశంలో రక్షణ దళాలు లేకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని బహిర్గతం చేస్తున్నదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేసి ఉగ్రవాదాన్ని అణచి వేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన 26 మంది కుటుంబాలను కేంద్రం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, యూటీఎఫ్ నాయకులు పి.గాయత్రి, చిట్టియ్య, ఐద్వా నేతలు గౌరీ, సూర్యప్రభ పాల్గొన్నారు.

నాతవరంలో...



ఉగ్రదాడికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న జనసేన నాయకులు

నాతవరం: మండలంలోని చెర్లోపాలెం గ్రామంలో శుక్రవారం జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడిని నిరసిస్తూ జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి నాయకులు రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ఉగ్రవాదులు నశించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ పర్యాటకులపై జరిగిన దాడి క్రూరమైన చర్య అని పేర్కొన్నారు. ఈ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు వి.వెంకటరమణ, నాయకులు ఎం.వెంకటరమణ, జి.నాయుడు పాల్గొన్నారు.

చీడికాడలో...

చీడికాడ: ఉగ్రవాదం, తీవ్రవాదం నశించాలంటూ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎలుసూరి ఘాటీ, నాయకులు గొటివాడ స్వామాట్‌కుమార్, రావాడ దేముడు, రావాడ రాము, కడితి రాంబాబు, కంటిపాము అచ్చియ్యమ్మ పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం: ఉగ్రదాడిని నిరసిస్తూ కల్యాణపులోవ, అజయ్‌పురం గ్రామాల్లో శుక్రవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సీపీఎం కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడతూఉగ్రవాదులను పూర్తిగా ఉక్కుపాదంతో అణిచివేయాలని కోరారు. దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయుకులు పాంగి చంద్రయ్య, విజయ్, గెమిలి వాసు తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో...


మాడుగుల బస్టాండ్ ఆవరణలో కొవ్వొత్తులతో మానవహారం చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: జమ్మూకశ్మీర్ ప్రాంతం పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ మాడుగులలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మాడుగుల బస్టాండ్ ఆవరణలో ర్యాలీ చేసి మానవహారంగా ఏర్పడ్డారు. ఉగ్రవాదుల దాడులను ముక్తకంఠంతో వ్యతిరేకించారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుట్టా గంగయ్య, దంగేటి సూర్యారావు, మండల సతీశ్, పుప్పాల రమేశ్, న్యాయవాది ఎస్.ప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించాలి


నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

రోలుగుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పంటలను సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించవచ్చునని ఆ శాఖ ఐసీఆర్పీ జ్యోతి, మెంటర్ ఇంటర్న్ ఎ.నాయుడుబాడు సూచించారు. మండలంలోని జానకిరాంపురం గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాల సాగుపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవధాన్యాలు భూమిలో పోషకాలను పెంచి భూసారాన్ని మెరుగుపరుస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి పంటలను సాగు చేయాలని సూచించారు. ద్రవ జీవామృతం ప్రయోగాత్మకంగా తయారు చేసే పద్ధతిని వివరించారు. అధిక సంఖలో రైతులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాకు సహకరించొద్దు


గబ్బాడ గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ రేవతమ్మ

నర్సీపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ హెచ్చరించారు. మండలంలోని గబ్బాడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ సులభతరంగా డబ్బు సంపాదించడానికి యువకులు గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇటువంటి నేరాలు చేయడం చేస్తే బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని పేర్కొన్నారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. మోసపూరితమైన ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. గ్రామానికి ఇరువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వలల నేర విచారణలో పుటేజీలు ఉపయోగపడతాయని సీఐ తెలిపారు.

అసంఘటిత కార్మికులకు గుర్తింపు


ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది

- ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు ప్రక్రియ
- మెప్మా, కార్మిక శాఖ, కామన్ సర్వీస్ సెంటర్‌కు బాధ్యతలు
- జిల్లాలో 60 వేల మంది కార్మికుల పేర్లు రిజిస్ట్రేషన్ చేయాలని లక్ష్యం
- మెప్మా ఆర్పీలకు సీఎస్‌సీ లాగిన్ ఇచ్చి రిజిస్ట్రేషన్లు
- అసంఘటిత కార్మికులకు కేంద్రం గుర్తింపు నంబర్లు

నర్సీపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులను గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వ ఈ-శ్రమ్ పోర్టల్‌లో అసంఘటిత కార్మికుల పేర్లు నమోదు చేస్తున్నారు. దీని కోసం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), కార్మిక శాఖ, కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లకు సంయుక్తంగా బాధ్యతలు అప్పగించారు. సీఎస్‌సీ లాగిన్‌లో మెప్మా ఆర్పీలు రిజిస్ట్రేషన్ ప్రక్రియ షురూ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఏ రకమైన రుసుము ఇవ్వనవసరం లేదు. నమోదైన కార్మికులకు ప్రత్యేక నంబరుతో గుర్తింపు కార్డు ఇవ్వడం, వారి నైపుణ్యాల ఆధారంగా ఉపాధి కల్పనకు శిక్షణ ఇవ్వాలన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.

జిల్లాలో 60 వేల మంది అసంఘటిత కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి అసంఘటిత కార్మికుని సెల్ ఫోన్ నంబరుతో అనుసంధానం చేసిన ఆధార్ నంబరు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో బ్యాంకు ఖాతా నమోదు చేయాలి.

అసంఘటిత కార్మికులంటే ఎవరు?

వ్యవసాయ, నిర్మాణ రంగం, గిగ్, ఫ్లాట్ ఫారం కార్మికులు, వీధి విక్రేతలు, ఇళ్లలో పని చేసేవారు, హమాలీలు, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, జమాటోలో పని చేసే డెలివరీ బాయ్స్ తదితరులంతా అసంఘటిత కార్మికుల కిందకు వస్తారు. 16 నుంచి 59 ఏళ్ల మధ్యలో ఉన్న కార్మికులంతా ఈ-శ్రమ్ పోర్టర్‌లో పేర్లునమోదు చేసుకోవచ్చు, ఎంప్లాయిస్ ప్రొవిడెంట్ ఫండ్, ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, నేషనల్ పెన్షన్ స్కీమ్ సభ్యుడై ఉండకూడదు.

ఈ-శ్రమ్ పోర్టల్ ముఖ్య లక్ష్యాలు ఇవీ..

- అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత సేవలు అమలు మెరుగుపరచడం
- వలస దారులు, నిర్మాణ కార్మికులకు సామాజిక భద్రత, సంక్షేమ లేబర్ కోడ్స్ అమలు చేయడం
- అసంఘటిత కార్మికుల కేంద్రీకృత డేటాను ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేయడం
- భవిష్యత్తులో కొవిడ్-19 వంటి జాతీయ సంక్షోభాలు సంభవించినప్పుడు ప్రభుత్వాలు సమగ్ర సమాచారాన్ని అందించడం.

కార్మికులు ఈ-శ్రమ్ నమోదు చేసుకోవాలి

-జగదీశ్వరరావు, జిల్లా మేనేజర్, కామన్ సర్వీస్ సెంటర్



అసంఘటిత కార్మికులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. మెప్మా ఆర్పీలు వచ్చినప్పుడు వారికి ఆధార్, బ్యాంక్ ఖాతా నెంబరు ఇవ్వాలి. రిజిస్ట్రేషన్ పూర్తి అయిన తర్వాత వారికి ప్రత్యేక గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగుతుంది.

మలేరియాను అంతం చేయడమే లక్ష్యం

- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి
- మలేరియాపై అవగాహన ర్యాలీలు




నర్సీపట్నం సదస్సులో మాట్లాడుతూ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి... దేవరాపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

నర్సీపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే రెండేళ్లలో మలేరియాను అంతం చేయడమే వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి అన్నారు. శుక్రవారం థెరెసా కాలనీలో అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, కప్పులు కాలువలలో వేయకూడదని ఆమె సూచించారు. నీటి తొట్టెలు, ట్యాంక్‌లపై మూతలు అమర్చుకోవాలని తెలిపారు. సెప్టిక్ ట్యాంక్ గాలి గొట్టాలకు నైలాన్ చిక్కాలు తొడగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.చాందిని దివ్యశ్రీ, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణ దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ నుంచి గ్రామ ప్రధాన రహదారిలో నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం మలేరియా జ్వరాలు రాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.గాయత్రి, వైద్య సిబ్బంది సావిత్రి, లక్ష్మి, లావణ్య, చిట్టిబాబు, మాణిక్యం పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: మండల కేంద్రంలో శుక్రవారం మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నినాదాలు చేశారు. అనంతరం వైద్యాధికారి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని బుచ్చెయ్యపేట, వడ్డాది, తురకలపూడి గ్రామాల్లో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది వివరించారు. అనుమానం వస్తే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఇంటి పరిసరాల్లో దోమలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటకృష్ణ, శకుంతల, సంధ్యారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండల కేంద్రంలో మలేరియా అంతం-మన పంతం అనే నినాదాలతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. దేవరాపల్లి వైద్యాధికారి పూజిత మేఘన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. దోమతెరలు వాడండి.. దోమలు అరికట్టండి అంటూ నినాదాలతో ర్యాలీ సాగించారు.

నాతవరంలో...

నాతవరం: ప్రజలలో మార్పు వచ్చినప్పుడే మలేరియా అంతమవుతుందని వైద్యాధికారి ప్రసన్న పేర్కొన్నారు. నాతవరంలో మలేరియాలపై వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా నిర్మూలనకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య సిబ్బంది టి.త్రివేణి, పి.బైరాగి తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండలో...

గొలుగొండ: మండలంలోని గొలుగొండ, చీడిగుమ్మల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో మలేరియాపై ర్యాలీ నిర్వహించారు. ప్రజల అవగాహనతోనే మలేరియా నిర్మూలన సాధ్యమని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు శ్యాంమ్‌కుమార్, ధనుంజయ్, మధుసూధనరావు, ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం: మండల కేంద్రంలో మలేరియాపై అవగహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజని మాట్లాడుతూ నీరు నిల్వ లేకుండ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే దోమతెరలను వాడాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పి.రామారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్షిత నీటి ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ


ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చీడికాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వివిధ పార్టీల నాయకుల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా మూడేళ్లుగా నిలిచిపోయిన రక్షిత నీటి ట్యాంకు నిర్మాణానికి ఎంపీడీవో హేమసుందర్రావు చొరవతో శుక్రవారం కదలిక వచ్చింది. చీడిపల్లి శివారు వెల్లంకి గ్రామంలో ఈ ట్యాంకు నిర్మాణం కోసం శుక్రవారం భూమి పూజ చేశారు. జల్ జీవన్‌మిషన్‌లో భాగంగా వాటర్ ట్యాంకు నిర్మాణానికి 2022లో రూ.30 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే వర్గ విభేదాల కారణంగా ట్యాంకు నిర్మాణం నిలిచిపోయింది. సర్పంచ్ సూర్యనారాయణ గురువారం మధ్యాహ్నం ఎంపీడీవోకు తీర్మానం చేసిన చోటనే ట్యాంకు నిర్మించాలని ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్.కనకమ్మ, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ పట్నాల గోపి, ఏపీవో అల్లు గంగునాయుడు, పంచాయతీ కార్యదర్శులు ఎ.సన్యాసిరావు, తలుపులమ్మ, వీఆర్‌వో రాజు, సర్వేయర్‌తో కలిసి మొదట తార్మనం చేసిన స్థలాన్ని పరిశీలించారు. చివరికి ఎవరికీ ఇబ్బందులు లేని పాఠశాల వెనుక భాగంలోని స్థలాన్ని పరిశీలించి ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేశారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడులు సాధించాలంటే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు స్పష్టం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో మట్టి నమూనా సేకరణ విధానాన్ని శుక్రవారం పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక భూములు, దిగుబడులు తక్కువగా నమోదవుతున్న భూముల్లో మట్టి నమూనా సేకరించి భూసార పరీక్షలు నిర్వహిస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మండలంలో ఈ ఏడాది 1390 మట్టిన మూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బంది ద్వారా నమూనాలను పరీక్షా కేంద్రానికి పంపించాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధారమఠం ఆలయ భూముల సాగుకు వేలం


ఆలయ భూముల వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

గొలుగొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతమల్లంపేట గ్రామంలో ఉమా ధారమల్లేశ్వరస్వామి ఆలయ భూములు సాగు లీజు కోసం శుక్రవారం ఆలయ ఈవో దివ్యతేజ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. గ్రామ రెవెన్యూలోని 24 ఎకరాల భూమిని సాగు చేసుకోవడానికి వేలం పాట నిర్వహించారు. ఈ పాటకు 25 మంది రైతులు హాజరయ్యారు. గొలుగొండ రెవెన్యూలోని ఐదు ఎకరాల భూమికి ఏడాదికి రూ.56,500 వేలం పాట జరిగింది. మరో ఎకరన్నర భూమికి రూ.12500కు వేలం పాట జరిగింది. తొమ్మిది బిట్ల వేలంపాటలో ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో వచ్చే నెల 13వ తేదీకి వాయిదా వేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాతమల్లంపేట గ్రామ సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి, టీడీపీ నాయకులు ఆనంద్, అప్పలనాయుడు, సుర్ల బిబ్బి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి విత్తనాల కిట్ల పంపిణీ

మాకవరపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణ రాజుపేట గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ ద్వారా ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలను అందజేశారు. మొత్తం 35 మంది రైతులకు ఈ విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, వెంకటగిరి, ఫణిరాజు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

చోడవరం అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటరావు, సూర్యనారాయణ



వెంకటరావు... సూర్యనారాయణ

చోడవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం అధ్యక్ష, కార్యదర్శులుగా కామిరెడ్డి వెంకటరావు, చీపురుపల్లి సూర్యనారాయణ ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా మరుపిల్ల యల్లారావు, సంయుక్త కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా బి.పైడిరాజు, స్పోర్ట్స్ కల్చరల్ కార్యదర్శిగా బి.చందు, లైబ్రరీ కార్యదర్శిగా వారాధి రాజు, కార్యవర్గ సభ్యుడిగా మహదేవుడు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా డి.సాంబమూర్తి వ్యవహరించారు. కాగా, బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి శుక్రవారం కోర్టు ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు కార్యవర్గాన్ని అభినందించారు.

గోవాడ పాల సంఘం డైరెక్టర్లుగా కూటమి నేతలు

చోడవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గోవాడ విశాఖ డెయిరీ పాలసంఘం డైరెక్టర్ల స్థానాలకు శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో ఇద్దరు కూటమి నేతలు ఎన్నికయ్యారు. జనసేనకు చెందిన ధరిమిశెట్టి దాలినాయుడు, టీడీపీకి చెందిన ఏడువాక ప్రసాదనాయుడు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. జనసేన డైరెక్టర్ దాలినాయుడును జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు నూకరాజు, గోపి, శేఖర్, అప్పారావు, శ్రీను, శంకరరావుర, కోటి, పరదేశి నాయుడు శ్రీను పాల్గొన్నారు.

పరారైన గంజాయి నిందితుడి అరెస్టు

గొలుగొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో ఐదేళ్ల క్రితం పరారైన నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. గొలుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి గంజాయి రవాణా సాగిస్తున్న వ్యక్తి బైక్‌ను వదిలి పరారీ అయ్యాడు. బైక్ రికార్డుల ఆధారంగా నిందితుడు వంతల సుందరరావు చింతపల్లి మండలం డేగలపాలెం పంచాయతీ శివారు కొత్తపాపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అప్పుడు 36 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టి ఒడిశా రాష్ట్రంలో అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన సుందరరావును కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు. ఐదేళ్ల తర్వాత నిందితుడిని పట్టుకున్న గొలుగొండ ఎస్ఐ రామారావును, సిబ్బందిని జిల్లా ఎస్పీ, నర్సీపట్నం డీఎస్పీ అభినందించి నగదు పురస్కారం అందించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలి మృతి

రోలుగుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బావిలో పడి రోలుగుంటకు చెందిన కామిరెడ్డి ఎర్రయ్యమ్మ (80) మృతి చెందినట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. కొంతకాలంగా తన అల్లుడైన ఎం.సత్తిబాబు వద్ద ఉంటున్నది. మతిస్థిమితం లేక అటుఇటూ తిరుగున్నది. గురువారం రాత్రి ఇంటికి నుంచి బయటకు వెళ్లిన ఎర్రయ్యమ్మ తిరిగి రాలేదు. కొవ్వూరు వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న బావిలో శుక్రవారం ఉదయం ఆమె మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. మృతురాలు అల్లుడు సత్తిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మెగా జాబ్‌మేళాను వినియోగించుకోండి

రావికమతం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం జరగనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు కోరారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమంలో భాగంగా ఈ జాబ్‌మేళాను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నిరుద్యోగ యువత కోసం ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 15 ప్రముఖ కంపెనీలకు చెందిన వారు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఈ మేళాలో పాల్గొన్న వారికి మధ్యాహ్న భోజన సదుపాయం కూడా కల్పిస్తామన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

కె.కోటపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలో జరగనున్న సీపీఐ రెండో జిల్లా మహాసభలకు విజయవంతం చేయాలని పార్టీ మండల నాయకులు గొర్లె దేవుడు బాబు, రెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన ఉద్యమాలకు సంపూర్ణ సహకారాలు అందించాలని, మూతపడిన చక్కెర కర్మాగారాలను ప్రారంభించాలని, రైతుల, కార్మికుల బకాయిలపై పోరాటం సాగించాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలుకు ఉద్యమించాలని తదితర డిమాండ్లను మహాసభల్లో చర్చించనున్నట్టు వారు చెప్పారు. ఈ సభలకు పార్టీ శ్రేణులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

మట్టి నమూనాలతో ఎరువుల వినియోగం కుదింపు

చీడికాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మట్టి నమూనా సేకరణతో ఎరువుల వినియోగాన్ని, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని మండల వ్యవసాయాధికారి ఎకృష్ణవేణి చెప్పారు. మండల కేంద్రంలో మట్టి నమూనా సేకరణపై 13 రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు ఈ ప్రక్రియ ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. మండలంలో 1045 మట్టి నమూనాలు సేకరించాలన్నది లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా మట్టి నమూనా సేకరణపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

ఎండలతో అప్రమత్తం!



» వడదెబ్బకు గురయ్యే ప్రమాదం » నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాపాయం

» రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
» చిన్నారులు, వృద్ధులు మరింత అప్రమత్తంగా ఉండాలి
» ముందస్తు చర్యలతో ఉపశమనం

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): **వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. పగటి పూట ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండే ఎండలతో వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం మేలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.**

అధిక ఎండల ప్రభావంతో వడదెబ్బ తగిలే అవకాశాలుంటాయి. ముఖ్యంగా శరీరంలో తగినంత నీటి పరిమాణం లేకుంటే వెంటనే సొమ్మసిల్లి పడిపోతారు. ముఖ్యంగా వడదెబ్బ తగిలినప్పుడు శరీరంలోని ద్రవాలు, రక్త పరిమాణం స్థాయి పడిపోవడంతో మెదడు, గుండెకు రక్త ప్రసరణ జరగక మరణాలు సంభవిస్తుంటాయని వైద్యులు చెబుతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందంటున్నారు.

లక్షణాలివి...

శరీరంలోని నీరు, లవణాలు (ఎలక్ట్రోలైట్స్, సోడియం, పొటాషియం క్లోరైడ్) సమతుల్యత దెబ్బతిని, చెమట రూపలో బయటకు వెళ్లిపోవడం వల్ల మనిషి తీవ్ర అస్వస్థతకు గురై వడదెబ్బ బారిన పడతాడు. దీంతో ప్రాణహాని కలిగే అవకాశం ఉంది. దీనిని వడదెబ్బ (సన్ స్ట్రోక్) అంటారు. వీటితో పాటు ఎగశ్వాస, ఎడతెరిపిలేని దాహం, కళ్లు తిరగడం, తూలిపోవడం, పరాకు మాటలు, శరీరమంతా చెమటలు పట్టడం, నాడి వేగం తగ్గిపోవడం, శరీర ఉష్ణోగ్రత 105 డిగ్రీల కంటే ఎక్కువ ఉండడం, తీవ్రమైన తలనొప్పి, నీరసం, చర్మం పొడిబారి పోవడం, మూత్రం పసుపు రంగులోకి మారి మంటరావడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాకుండా విపరీతమైన నీరసం ఆవహించి, అపస్మారక స్థితిలోకి వెళ్లి పోతారు.

నివారణ చర్యలివీ..

వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే సమయంలో బయటకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండాలి. ఉదయం పూటే పనులన్నీ పూర్తి చేసుకోవాలి. తప్పనిసరి పరిస్థితిలో బయటకు వెళ్లాల్సి వస్తే తలపై టోపీ లేదా గొడుగు ఉపయోగించాలి. దాహం వేసేంత వరకూ ఆగకుండా నీరు, ఇతర ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. చెమటను పీల్చుకొని, వదులుగా ఉండే కాటన్ దుస్తులను ధరించాలి. కళ్లకు రక్షణ కోసం చలువ కళ్లద్దాలు ధరించాలి. తక్కువ మోతాదులో ఎక్కువసార్లు మంచి నీరు, జ్యూస్‌లు తీసుకోవడం శ్రేయస్కరం. ఎండా కాలం వీలున్నంత వరకూ మాంసాహారానికి దూరంగా ఉండాలి. తేలికగా జీర్ణమయ్యే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, తాటి ముంజలు, కొబ్బరిబొండాలు, నీళ్లు, ఐస్ లేకుండా చెరకు రసం, పండ్ల రసాలు, గంజి, మజ్జిగ, బార్లీ తీసుకోవాలి. వడదెబ్బ బారిన పడితే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తరచుగా తీసుకోవాలి.







చికిత్సా విధానం...

వడదెబ్బ బారిన పడిన వ్యక్తిని చల్లని నీడ ఉన్న ప్రదేశానికి తీసుకువెళ్లాలి. తడిగుడ్డతో పలుమార్లు శరీరాన్ని తుడవాలి. ఎక్కువగా ద్రవ పదార్థాలు ఇవ్వాలి. గ్లాసు నీళ్లలో రెండు స్పూన్ల పంచదార, చిటికెడు ఉప్పు, నిమ్మ రసం వేసి తాగించాలి. ఒకవేళ అపస్మారక స్థితిలోకి వెలితే శరీరం పైఉన్న వస్త్రాలు తొలగించి, చల్లని గాలి తగిలే నీడ ఉన్న చోట కూర్చోబెట్టాలి. స్పృహలోకి వచ్చాక ద్రవ పదార్థాలు ఇవ్వాలి. ఏసీ ఉన్న గదిలో ఉంచితే మరీ మంచిది. అప్పటికీ బాధితుడు కోలుకోలేకపోతే సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించాలి. అక్కడ ఐవీ ఫ్ల్యూయిడ్స్ ఇచ్చి వైద్యుల సంరక్షణలో బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేయించాలి. సాధారణ స్థితిలోకి వచ్చే వరకే ఫ్ల్యూయిడ్స్ ఎక్కించాల్సి ఉంటుంది. బాధితుని బీపీ, పల్స్ ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి.

అప్రమత్తత అవసరం



పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఉదయం పూటే బయట పనులన్నీ చక్కబెట్టుకోవాలి. అవసరం లేకుండా ఎండలో తిరగకూడదు. వడదెబ్బపై సరైన అవగాహన లేకపోవడం వలన అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయే ప్రమాదం ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లేవారు తమ వెంట విధిగా వాటర్ బాటిల్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గొడుగు తీసుకువెళ్లాలి.

- వేగి అవినాష్, ఎండీ, జనరల్ ఫిజీషియన్

నేడు ముఖ్యమంత్రి రాక

» ఏఎంసీలో సెంటినరీ అలూమ్ని భవనాన్ని ప్రారంభించనున్న చంద్రబాబునాయుడు



ఏఎంసీలో నిర్మించిన సెంటినరీ అలూమ్ని భవనం

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం నగరానికి వస్తున్నారు. ఉదయం 10.40 గంటలకు గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 11.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం వెళ్లి...మత్స్యకార భరోసా నిధులు పంపిణీ చేస్తారు. అక్కడి నుంచి సాయంత్రం 5.25 గంటలకు బయలుదేరి 5.45 గంటలకు నగరంలోని కోస్టల్ బ్యాటరీకి చేరుకుంటారు. అనంతరం రోడ్డు మార్గంలో 5.55 గంటలకు ఆంధ్ర వైద్య కళాశాలకు చేరుకుని, శతాబ్ది ఉత్సవాలకు గుర్తుగా నిర్మించిన సెంటినరీ అలూమ్ని భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం వైద్యులతో వివిధ అంశాలపై చర్చిస్తారు. సాయంత్రం 6.55 గంటలకు ఏఎంసీ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రి 7.15 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని 7.25 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం వెళతారు.

ఆంధ్ర మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.50 కోట్ల వ్యయంతో సెంటినరీ అలూమ్ని భవనాన్ని నిర్మించారు. భవన నిర్మాణానికి నిధులు సమీకరించే కమిటీకి చైర్మన్‌గా ప్రముఖ వైద్యులు డాక్టర్ టి.రవిరాజు వ్యవహరించారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశ, విదేశాల్లోని సుమారు 300 మంది వైద్యుల ఆర్థిక సహకారంతో నాలుగు అంతస్థుల్లో ఈ భవనాన్ని అత్యాధునిక వసతులతో నిర్మించారు. సుమారు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన భవనంలో 600 మంది కూర్చునేలా అధునాతన ఆడిటోరియం ఉంది. ఎల్ఈడీ స్ర్కీన్స్‌తో పాటు వైద్య విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా పెద్ద గ్రంథాలయాన్ని, డిజిటల్ లైబ్రరీని అందుబాటులో ఉంచారు. రీడింగ్ రూమ్స్, లెక్చర్ హాల్స్ ఉన్నాయి. ఏఎంసీ చరిత్రతోపాటు పూర్వ విద్యార్థుల్లో ప్రముఖుల జీవిత విశేషాలు, ఇతర అంశాలకు సంబంధించిన ఎగ్జిబిషన్ హాల్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు.

పైపులైన్లు పూర్తయిన గ్రామాలకు తాగునీటి సరఫరా



వాటర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, డీపీవో శిరీషారాణి

నక్కపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండపురం వద్ద వున్న వాటర్ ప్రాజెక్టును శుక్రవారం జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, డీపీవో ఆర్. శిరీషారాణి ,ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామి తనిఖీ చేశారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా వీలైనంత త్వరగా పైప్‌లైన్ల ఏర్పాటు పనులు పూర్తయిన గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలని సీఈవో నారాయణమూర్తి ఆదేశించారు. వీరి వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఆనంద్, నర్సీపట్నం డీఈ జయరాం, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోఆర్‌డీ పి.శ్రీను, జేఈ వంశీప్రియ వున్నారు.

మెట్ట భూములకు జీవం

» పచ్చిరొట్ట సాగుకు 20-30 రకాల విత్తనాలు
» ఒక్కో రైతుకు 12 కిలోల కిట్ అందజేత
» జిల్లాలో 14 వేల ఎకరాల్లో విత్తనాలు వేయాలని లక్ష్యం



వ్యవసాయ శాఖ పంపిణీ చేసిన విత్తనాలతో రైతులు

అనకాపల్లి అగ్రికల్చర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవన వర్షాలకు ముందే మెట్ట భూముల్లో వివిధ రకాల విత్తనాలను చల్లి, నేలను వ్యవసాయానికి అనుకూలంగా మార్చే ప్రక్రియకు వ్యవసాయ శాఖ శ్రీకారం చుట్టింది. సాధారణంగా రైతులు వేసవిలో కురిసే చెదురుమదురు వర్షాలకు పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని, ఖరీఫ్‌లో పంటలు వేసే ముందు పచ్చిరొట్ట పైరును పొలంలో కలియదున్నుతారు. అయితే పిల్లి పెసర, జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట విత్తనాలే కాకుండా చిరుధాన్యాలు, తృణధాన్యాలు, అపరాలు వంటి 20-30 రకాల విత్తనాలను కిట్ల రూపంలో రైతులకు అందజేస్తున్నారు.

జాంబియా దేశంలో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానం మంచి ఫలితాన్ని ఇచ్చింది. బీడు భూములు పచ్చదనంతో నిండి రైతులు జీవనోపాధి మెరుగుపరుచుకునేందుకు ఈ పద్ధతి ఉపయోగపడుతుంది. గాలిలోని తేమను వినియోగించుకుని నేలను ఆకుపచ్చదనంతో నింపే ఈ విధానాన్ని ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. వర్షాధార భూముల్లో సైతం పంటల వైవిధ్యం, జీవ వైవిధ్యం పెంపొందడానికి ఈ పద్ధతి దోహదం చేస్తుంది. నైరుతి రుతుపవన వర్షాలకు ముందు అడపదడపా కురిసిన వర్షాలకు రైతులు పొలాలను దున్ని పచ్చిరొట్ట విత్తనాలు వేయడానికి సిద్ధం చేస్తారు. అయితే ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ సిస్టంలో భాగంగా కేవలం పచ్చిరొట్ట విత్తనాలే కాకుండా చిరుధాన్యాలు, తృణధ్యానాలు, కాయ ధాన్యాలు, పప్పు దినుసుల విత్తనాలను కలగలిపి పొలంలో చల్లుతారు. సుమారు 40-50 రోజులు పెరిగిన తరువాత పొలంలో కలియదున్నుతారు. దీనివల్ల నేల ఆరోగ్యాన్ని మెరుగుపడుతుంది. నేలలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుంది. తద్వారా పంటలకు ఎంతో మేలు చేస్తుంది. అంతేకాక నేల కోతను అరికడుతుంది. సేంద్రీయ కర్బనాన్ని పెంపొందిస్తుంది. అనంతపురం జిల్లాలో ఈ పద్ధతి విజయవంతం కావడంతో మిగతా జిల్లాల్లో కూడా దీనిని అవలంబిస్తున్నారు.

జిల్లాలో 14 వేల ఎకరాలు లక్ష్యం

అనకాపల్లి జిల్లాలో 14 వేల ఎకరాలను పీఎండీఎస్ సాగు కిందకు తేవాలని లక్ష్యంగా నిర్ణయించామని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా పిల్లి పెసర, జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట విత్తనాలు, పశుసంవర్థక శాఖ నుంచి జనుము, గడ్డి విత్తనాలు సమకూర్చుతామని చెప్పారు. వీటితోపాటు అపరాలు, ధాన్యం జాతికి చెందిన 20-30 రకాల విత్తనాలను కలిపి 12 కిలోల కిట్లను రైతులకు అందజేస్తామన్నారు.

సాగునీటి చెరువులో అక్రమ తవ్వకాలు





మట్టి తవ్వకాలు జరుగుతున్న రాయపురాజ్ చెరువు (ఇన్‌సెట్‌లో) మట్టి తరలించుకుపోవడానికి చెరువు గట్టు తవ్వేసి ఏర్పాటు చేసిన రహదారి

నబ్బువరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలపాలెం, నంగినారపాడు రెవెన్యూ పరిధిలో గల రాయపురాజ్ చెరువులో అడ్డుగోలుగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వుకుపోతున్నారు. ఫొటోలు, వీడియోలు తీసి, సంబంధిత అధికారులకు పంపినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు చెబుతున్నారు.

మండలంలోని గొల్లలపాలెం సర్వే నంబరు 266లో 75 ఎకరాలు, నంగినారపాడు సర్వే నంబరు 76.90 ఎకరాలు మొత్తం 151.9 ఎకరాల విస్తీర్ణంలో రాయపురాజ్ చెరువు విస్తరించి ఉంది. గొల్లలపాలెం పరిధిలోని భాగంలో నీరు నిలిచే వీలుంది. మిగిలిన సుమారు 60 ఎకరాల్లో వివిధ రకాలు చెట్లు, ముళ్ల పొదలు పెరిగిపోయాయి. అయితే ఈ రెండు గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు, ప్రభుత్వ శాఖల నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండా చెరువులో మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఒక క్రమపద్ధతిలో కాకుండా ఎక్కడ పడితే అక్కడ పెద్దపెద్ద గోతులు తవ్వుతున్నారు. అంతేకాక చెరువులోకి వర్షం నీరు వచ్చే గెడ్డ గట్టును యంత్రాలతో తవ్వేసి, మట్టి తరలించుకుపోయే వాహనాలకు దారి ఏర్పాటుచేశారు. సాగు నీటి చెరువుల్లో మట్టి తవ్వి తీసుకెళ్లాలంటే నీటిపారుదల, రెవెన్యూ శాఖల నుంచి అనుమతులు పొందాలి. కానీ ఇక్కడ ఎటువంటి అనుమతులు తీసుకోకుండా మట్టి తవ్వుకుపోతున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నూకాంబిక కొత్త అమావాస్య జాతర రేపటితో ముగింపు



అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఈ నెల 27వ తేదీ ఆదివారంతో ముగియనుంది. ఈ సందర్భంగా నెల పండుగ జరుపుకోనున్నారు. ఆఖరి ఆదివారం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు అధికసంఖ్యలో తరలివచ్చే అవకాశం వుంది. ఈ మేరకు ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర ముగింపు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడానికి సాయంత్రం నాలుగున్నర గంటల నుంచి దర్శనాలు నిలిపివేయనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ ఈవో వెంపలి రాంబాబు తెలిపారు. 28వ తేదీ ఉదయం ఐదు గంటల నుంచి అమ్మవారి పునర్దర్శనం ఉంటుందని చెప్పారు.



విశాఖలో దంపతుల హత్య

» 24 గంటల తరువాత వెలుగులోకి...



యోగీంద్రబాబు, లక్ష్మి (ఫైల్ ఫొటోలు)

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధ దంపతులు హత్యకు గురయ్యారు. ఇందుకు సంబంధించి బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేవల్ డాక్‌యార్డు రిటైర్డ్ ఉద్యోగి గంపల యోగీంద్రబాబు (66), భార్య లక్ష్మి (52) గత 30 ఏళ్లుగా జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్ నగర్‌లో నివాసముంటున్నారు. ఐదు రోజుల క్రితం ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు హైదరాబాద్ వెళ్లారు. రెండు రోజుల క్రితం తిరిగివచ్చారు. శుక్రవారం సాయంత్రం యోగీంద్రబాబు ఇంటికి ఆయన మేనల్లుడు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉంది. ఇరువురికీ ఫోన్ చేస్తే ఇంట్లో రింగ్ అవుతుండడంతో అనుమానం వచ్చి కిటికీ తలుపులు తీసి చూడగా...రక్తపు మడుగులో యోగీంద్రబాబు కనిపించారు. దాంతో వెంటనే 100కి ఫోన్ చేశారు. సీపీ ఆదేశాల మేరకు ఏసీపీ టి.త్రినాథ్, దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తాళం బద్ధలు కొట్టించారు. లోపలకు వెళ్లి చూస్తే హాల్‌లో యోగీంద్రబాబు, మరో రూమ్‌లో లక్ష్మి రక్తపు మడుగులో పడి మృతిచెంది ఉన్నారు. బంగారం, నగదు కోసం కోసం ఎవరైనా హత్య చేశారా?, అనే కోణంలో పరిశీలిస్తున్నారు. హత్య జరిగి 24 గంటలు అయి ఉంటుందని (బహుశా గురువారం రాత్రి) పోలీసులు చెబుతున్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన యోగీంద్రబాబు, విశాఖ రామకృష్ణాపురానికి చెందిన లక్ష్మి ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు (సుజిత్, శిల్ప) ఉన్నారు. ఇరువురూ అమెరికాలో ఉన్నారు. లక్ష్మి ప్రస్తుతం స్థానిక గ్లోరియా స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నారు.

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో అప్పంపాలెం గ్రామానికి చెందిన చెల్లపు వరలక్ష్మి, తన ఇద్దరు ఆడపిల్లలతో కనిపించడం లేదని ఆమె భర్త చెల్లపు శివ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 24వ తేదీ ఉదయం 8 గంటలకు వరలక్ష్మి తన ఇద్దరు ఆడపిల్లలు టర్నికశ్రీ(8), కుందన(6)లతో అప్పంపాలెం నుంచి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి వెళ్లింది. తిరిగి ఆమె ఇంటికి రాకపోవడంతో వారి కోసం శివ గాలించాడు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

శతాబ్ది సంబరాలకు వేళాయె

... 3వ పేజీ తరువాయి

విజన్ డాక్యుమెంట్, లోగో ఆవిష్కరణ, ప్రత్యేక నృత్య రూపకల్పన, తదితర కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్, ఉప కులపతి, అతిథుల ప్రసంగాలు ఉంటాయి. సాయంత్రం 6.30 గంటల వరకు ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ విద్యార్థులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొంటారని అధికారులు భావిస్తున్నారు. సమావేశంలో రెక్టార్ ఎన్.కిశోర్‌బాబు, ఏయూ క్యాంపస్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ దీప కాంతులతో ప్రాంగణం

శతాబ్ది ఉత్సవాల ప్రారంభం నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యుత్ కాంతులతో వెలుగులీనుతోంది. వర్సిటీ పరిపాలనా భవనం, ప్రవేశ మార్గాలు, విభాగాలు, పలు భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

283 మంది పోలీసు సిబ్బంది బదిలీ

... 3వ పేజీ తరువాయి

విధానంలో 283 మందికి బదిలీలు జరిగాయి. వీరిలో 161 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 95 మంది హెచ్ కానిస్టేబుల్స్, 27 మంది అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. బదిలీ అయిన పీసీల్లో 57 మంది మహిళలు వున్నారు.

కునారిల్లుతున్న పశు వైద్యం

... 3వ పేజీ తరువాయి

పట్టుకోవడానికి, నేలపై పడుకోబెట్టడానికి సబార్డినేట్‌లు అవసరం. సహాయ సిబ్బంది లేని ఆస్పత్రుల్లో వారు చేయాల్సిన పనులను కూడా పశు వైద్యులే చేసుకోవాల్సి వస్తున్నది. అయితే సచివాలయాల్లోని సహాయ పశు వైద్య సిబ్బంది, గోపాల మిత్రలు సేవలు అందిస్తుండడంతో కొంత వరకు సిబ్బంది కొరత నుంచి ఉపసమనం కలుగుతున్నది. జిల్లాలో 59 పశు వైద్యశాలలకు మరుగుదొడ్లు లేవు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది.. ప్రధానం మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సబ్ డివిజన్ స్థాయి పశు వైద్యశాల్లో ఆపరేషన్ థియేటర్లు, మీటింగ్ హాళ్లు లేవు. ఆపరేషన్ థియేటర్లు లేకపోవడంతో పశువులకు, జీవాలకు ఆరుబయట శస్త్ర చికిత్సలు చేయాల్సి వస్తున్నది. జిల్లాలో 45 వెటర్నరీ ఆస్పత్రులను పురాతన భవనాల్లో నడుపుతున్నారు. శిథిలావస్థకు చేరిన ఈ భవనాలు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడంలేదు. ఏటా నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం, అవి బుట్టదాఖలు కావడం అనవాయితీగా వస్తున్నది. గతంలో గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన సంస్థ నుంచి పశువైద్యశాలల భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు అయ్యేవి. కొన్నేళ్ల నుంచి ఈ సంస్థ నిధులు మంజూరు చేయడం లేదు.

ఉగ్రదాడి నుంచి త్రుటిలో తప్పించుకున్నాం

... 3వ పేజీ తరువాయి

ప్రాంతాలు సందర్శించారు. 22వ తేదీన పహల్గాం చేరుకున్నారు. మధ్యాహ్నం వరకు ఆహ్లాదంగా గడిపారు. ఒంటిగంట సమయంలో నడక మార్గంలో వెనుదిరిగారు. మరో పది నిమిషాల్లో తుపాకీ కాల్పుల మోతలు వినిపించాయి. దీంతో తీవ్ర భయాందోళన చెంది పరుగులు తీశారు. రాత్రి 10 గంటలకు జమ్ము చేరుకున్నారు. అక్కడి నుంచి విమానంలో హైదరాబాద్‌కు, అక్కడి నుంచి విశాఖకు విమానంలో వచ్చి అనకాపల్లిలో ఇంటికి చేరుకున్నారు. మరికొంతసేపు పహల్గాం వుండి వుంటే పరిస్థితి ఏ విధంగా వుండేదో తలుచుకుంటేనే భయమేస్తున్నదని శ్రీబాలాజీ అన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434